# నో స్టాక్... హైదరాబాదులో మూతపడుతున్న పెట్రోల్ బంకులు!

- హైదరాబాద్‌లో పెట్రోల్ కష్టాలు.. పలుచోట్ల 'నో స్టాక్' బోర్డులు
- తెరిచి ఉన్న బంకుల వద్ద వాహనదారుల భారీ క్యూలు
- పెట్రోల్, డీజిల్ కొరత లేదన్న ప్రభుత్వం... వదంతులే కారణమని వెల్లడి
- నిల్వ ఉంచేవారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక

-4 లో




# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

# పాఠ్యాంశంలో రాజ్యాంగం తప్పనిసరి చేయండి

- తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గట్టు అశోక్- ఉద్యమం వ్యవస్థాపకులు అంజన్న..
- తెలంగాణలో పాఠశాల స్థాయి నుంచే భారత రాజ్యాంగంపై అవగాహన..

- తెలంగాణలో 33 జిల్లాల్లో తిరుగుతూ అవగాహన కల్పించిన అంశం..
- మేడ్చల్‌లో ముగింపు దశకు చేరిన ఉద్యమం కలెక్టర్‌కు వినతిపత్రం..
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి వినతి పత్రాలు..



రాజ్యాంగాన్ని విద్యా వ్యవస్థలో భాగం చేయాలన్న డిమాండ్ రోజురోజుకీ బలపడుతోంది.. సామాజిక న్యాయం, హక్కులపై అవగాహన పెంచేందుకు ఇది ఎంతో కీలకమని ఉద్యమకారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.. అయితే ఇప్పటికే 5వ తరగతిలోనే ఆర్టీఏ యాక్ట్ గురించి కూడా ఉన్నప్పటికీ.. మరింత విస్తృత పరిస్తే, బాగుంటుందనేది న్యాయ నిపుణుల వాదన.. ప్రతి నెల చివరిలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా, సామాన్యులకు సైతం చట్టాలపై అవగాహన కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం పలు కాలనీలు, గ్రామాలలో రెవెన్యూ, పోలీసు అధికారులు నిర్వహిస్తున్నది తెలిసిందే.. అయినప్పటికీ 6వ తరగతి నుంచి పదవ తరగతి వరకు ప్రత్యేక సబ్జెక్టులుగా, రాజ్యాంగాన్ని పాఠ్యాంశంలో చేరిస్తే పౌరహక్కులపై ప్రజలకు మరింత అవగాహన కల్పించినట్టు అవుతుందని భావిస్తున్నారు.. ఈ అంశంపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో ఇప్పుడు ఆసక్తికరంగా మారింది..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి 24:



పాఠ్యాంశాలలో భారత రాజ్యాంగాన్ని చేర్చాలని తెలంగాణలో 33 జిల్లాల్లో తిరుగి, కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందజేయాలని జై భీమ్ మహాసేన మనవహక్కుల పరిరక్షణ సంఘం వ్యవస్థాపకులు అంజన్న, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గట్టు అశోక్ అన్నారు.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు ప్రత్యేక సబ్జెక్టులుగా పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్ పై గత 25 రోజుల నుండి తెలంగాణ 33 జిల్లాల పర్యటనలో భాగంగా, తిరుగుతూ 30 జిల్లాలు సంపూర్ణంగా ప్రజలను చైతన్య పరుస్తూ ఆయా జిల్లా మెజిస్ట్రేట్ అయినటువంటి కలెక్టర్‌లకు మొమొరాండం సమర్పించినట్టు ఉద్యమ కారుడు గట్టు అశోక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.. ఈ వినతి పత్రాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చేరేటట్లుగా చేయాలని కలెక్టర్‌లను కోరినట్లు తెలిపారు.. ప్రతి జిల్లా కలెక్టర్ కూడా తమ మనవి ఆలకించి వినతి పత్రాలు తీసుకోవడం జరిగిందని అన్నారు.. ఈ విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల ప్రజలకు రాజ్యాంగం పట్ల అవగాహన సదస్సులు కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుంటూ 31వ జిల్లా అయినా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు పూల దండలు వేసుకుంటూ, జిల్లా వ్యాప్తంగా ఈ రథయాత్ర కొనసాగిందని అన్నారు.. ఈ కార్యక్రమంలో జై భీమ్ మహాసేన మనవహక్కుల పరిరక్షణ సంఘం వ్యవస్థాపకులు అంజన్న, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గట్టు అశోక్, మహిళా విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఏ ఎస్తేరు రాణి గారు సలహాదారులు అలెగ్జాండర్ ప్రభు, బాలస్వామి, బ్రాహ్మ మరియు ఎల్లన్న, అంబేద్కర్ .సంఘం అధ్యక్షులు రాములు . నాగేష్ పాల్గొని మేడ్చల్ జిల్లా రథయాత్ర కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.



# బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను సిగ్గులేకుండా వారి ఖాతాలో వేసుకుంటున్నారు

- బీఆర్ఎస్ విద్యార్థి నేతల అరెస్ట్‌పై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- 2 లక్షల ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీ ఏమైందని ప్రశ్న
- ప్రశ్నించిన గొంతుకలపై నిర్బంధం ఎమర్జెన్సీని తలపిస్తోందని విమర్శ
- గురుకులాల్లో విద్యార్థుల మరణాలపై సీఎం స్పందించకపోవడం దారుణమని ఆగ్రహం

హైదరాబాద్ పెన్ పవర్:బీఆర్ఎస్ ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గులేకుండా తమ ఖాతాలో వేసుకుంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి,

-4 లో

# మల్లారెడ్డి నిజాలు మాట్లాడుతారనుకుంటే మళ్లీ అవే అబద్ధాలు చెబుతున్నారు

- మల్లారెడ్డి చెప్పిన సమస్యను దృష్టిలో ఉంచుకుంటామన్న శ్రీధర్ బాబు
- ప్రత్యామ్నాయ ప్రాంతాన్ని పరిశీలిస్తామని హామీ
- నగరం నలుమూలలా డంపింగ్ యార్డులు ఏర్పాటు చేస్తామన్న మంత్రి



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్‌లోని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై మాట్లాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. మల్లారెడ్డి నిజాలు మాట్లాడుతారనుకుంటే, మళ్లీ అబద్ధాలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు అన్నీ చేశామని చెప్పారని, ఇప్పుడు మళ్లీ సమస్యలను లేవనెత్తుతున్నారని విమర్శించారు.మల్లారెడ్డి చెప్పిన సమస్యను దృష్టిలో

-4 లో

# అసెంబ్లీలో మల్లారెడ్డి మార్క్ ప్రసంగం..

## డంపింగ్ యార్డ్ వాసన భరించలేకపోతున్నానంటూ ఆవేదన!

- నగరంలోని చెత్త అంతా తన నియోజకవర్గంలోనే పడుతోందన్న మల్లారెడ్డి
- మేడ్చల్ ఎమ్మెల్యేగా ఎందుకున్నానా అని బాధపడుతున్నానని వ్యాఖ్య
- చెత్త గుట్టల వల్ల ప్రజలు నరకం చూస్తున్నారని ఆవేదన
- నియోజకవర్గంలో డ్రైనేజీలు, రోడ్లు సరిగా లేవన్న మల్లారెడ్డి
- మేడ్జల్ మీద కనికరం చూపించాలంటూ మంత్రి శ్రీధర్ బాబుకు విన్నపం



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ అసెంబ్లీ వేదికగా మేడ్చల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి మరోసారి వార్తల్లో నిలిచారు. తన నియోజకవర్గ సమస్యల గురించి ఆయన మాట్లాడుతూ... జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ దుస్థితిని వివరిస్తూ చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. నగరం నలుమూలల నుంచి వచ్చే చెత్త అంతా తన నియోజకవర్గంలోనే పడుతోందని, ఆ వాసన భరించలేక "నేను ఎందుకు మేడ్చల్ ఎమ్మెల్యేగా ఉన్నానా?"

-4 లో

# కేటీఆర్, రాజగోపాల్ రెడ్డి, పాయల్ శంకర్.. ఒకే టేబుల్‌పై భోజనం,

## రెండు గంటలకు పైగా సమాలోచనలు




- అసెంబ్లీలోని మెంబర్స్ లాంజ్‌లో ఆసక్తికర సన్నివేశం
- లాంజ్‌లో ఒకే టేబుల్‌పై కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యేలు
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంభాషణ

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు కలిసి భోజనం చేశారు. ఆ తర్వాత ముగ్గురు సరదాగా మాట్లాడుకున్నారు. మంగళవారం అసెంబ్లీలోని మెంబర్స్ లాంజ్‌లో ఈ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, బీజేపీ శాసనసభ్యుడు పాయల్ శంకర్ ఒకే టేబుల్‌పై భోజనం చేశారు. ఆ తర్వాత అక్కడే చాలాసేపు వారు మాట్లాడుకున్నారు. రెండు గంటలకు పైగా వారి మధ్య సంభాషణలు జరగడం గమనార్హం. మూడు పార్టీలకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు కలిసి సుదీర్ఘంగా మాట్లాడుకోవడం ఆసక్తిగా మారింది.

# సాదాబైనామా సమస్యను పరిష్కరిస్తున్నాం

హైదరాబాద్ పెన్ పవర్: సాదాబైనామా సమస్యను పరిష్కరిస్తామని, ఇకపై భూమి అమ్మిన వారు అఫిడవిట్ ఇవ్వాల్సిన అవసరం లేదని, కొనుగోలుదారులు ఇస్తే సరిపోతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. శాసనమండలిలో మంగళవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుడు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. "రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం. నాటి భారాస ప్రభుత్వం సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించింది కానీ 2020 ఆర్‌వోఆర్ చట్టంలో పరిష్కారమార్గం చూపలేదు. భూ భారతి చట్టంలో ఈ సమస్యకు పరిష్కారం చూపించాం. అయితే కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరు అఫిడవిట్ ఇవ్వాలన్న నిబంధనతో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 18న జీవో 76 తెచ్చాం. కేవలం కొనుగోలుదారులు ప్రమాణపత్రం ఇస్తే భూములు రిజిస్ట్రేషన్ అయ్యేలా సవరణలు చేశాం. ఆధార్ మాదిరిగానే 'భూదార్' తీసుకొస్తాం. నక్షా లేని 413 గ్రామాలకుగాను

-4 లో



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# నో స్టాక్... హైదరాబాదులో మూతపడుతున్న పెట్రోల్ బంకులు!

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలో మంగళవారం నాడు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనేక పెట్రోల్ బంకులు 'నో స్టాక్' బోర్డులు పెట్టి మూసివేయడంతో, తెరిచి ఉన్న కొన్ని బంకుల వద్ద కిలోమీటర్ల మేర క్యూలు కనిపించాయి. రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత లేదని అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది.
నగరంలోని ఉప్పల్, మల్లాపూర్, ఘట్‌కేసర్, అత్తాపూర్, కాటేదాన్, చంద్రాయణగుట్ట వంటి ప్రాంతాల్లో చాలా పెట్రోల్ పంపులు మూతపడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కొన్నిచోట్ల తెరిచి ఉన్న బంకుల వద్ద కార్లు, ఆటోలు, బైక్‌లతో భారీ రద్దీ నెలకొంది. నాంపల్లిలో సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద ఆటోలు గంటల తరబడి బారులు తీరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.
ఈ పరిణామాలపై తెలంగాణ పౌరసరఫరాల శాఖ స్పష్టత ఇచ్చింది. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ లేదా వంట గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని ప్రకటన చేసింది. కొన్ని తప్పుడు వదంతుల కారణంగా ప్రజలు ఆందోళనకు గురై, తమ వాహనాలకు ట్యాంకులు నింపుకోవడానికి ఒక్కసారిగా బంకులపై పడటంతో ఈ కృత్రిమ కొరత ఏర్పడిందని వివరించింది. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ముందస్తు చెల్లింపుల విధానంలో చేసిన మార్పుల వల్ల కొందరు డీలర్లకు తాత్కాలికంగా ఇబ్బందులు ఎదురైన మాట వాస్తవమేనని, కానీ సరఫరాపై దీని ప్రభావం లేదని పేర్కొంది. ఇంధనాన్ని అక్రమంగా నిల్వ చేసినా, బ్లాక్ మార్కెట్‌కు తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. ప్రజలు వదంతులను నమ్మవద్దని, ఆందోళన చెందవద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ 'ఎక్స్' వేదికగా విజ్ఞప్తి చేశారు. నగరంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని ఆయన తెలిపారు. ఏదైనా సమాచారం కోసం 1967 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను సిగ్గులేకుండా వారి ఖాతాలో వేసుకుంటున్నారు

-3 పేజి తరువాయి
అధికారంలోకి వచ్చాక దానికి పాతరేశారని మండిపడ్డారు. తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను నయవంచన చేశారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.
పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందన్న డిమాండ్లతో అసెంబ్లీ ముట్టడికి యత్నించిన బీఆర్ఎస్ విద్యార్థి నేతలను అరెస్టు చేయడం దుర్మార్గమని కేటీఆర్ అన్నారు. బడ్జెట్ సమావేశాల సమయంలోనైనా నిధులు విడుదల చేయాల్సిందిపోయి, ప్రశ్నించిన గొంతుకలపై ఉక్కుపాదం మోపడం రాష్ట్రంలో ఎమర్జెన్సీ వాతావరణాన్ని తలపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీల అమలు కోసం విద్యార్థులు అసెంబ్లీని ముట్టడించాల్సిన దుస్థితిని కల్పించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుపడాలని హితవు పలికారు.
విద్యాశాఖ మంత్రిగా కూడా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యం వల్లే రాష్ట్రంలో విద్యావ్యవస్థ కుప్పకూలిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, పేద విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో 127 మంది విద్యార్థులు మరణించినా ముఖ్యమంత్రిలో కనీస చలనం లేదని, ఇప్పటివరకు దానిపై స్పందించకపోవడం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి బకాయిపడ్డ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మాటను మూడేళ్లు కావస్తున్న నేపథ్యంలోనైనా నిలబెట్టుకోవాలని సూచించారు. అక్రమంగా అరెస్టు చేసిన బీఆర్ఎస్వీ నాయకులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# సాదాబైనామా సమస్యను పరిష్కరిస్తున్నాం

-3 పేజి తరువాయి
5 ఊళ్లలో ప్రయోగాత్మకంగా సర్వే నిర్వహించాం. ఇందులో ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ లాగే భూధార్ సంఖ్యను కేటాయించాం. త్వరలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లోని 70 గ్రామాల్లో ప్రయోగాత్మకంగా భూ సర్వే నిర్వహించనున్నాం" అని వివరించారు. ఎవరినీ ఉపేక్షించం: ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకొని కొంత మంది మీ సేవ నిర్వాహకులు అవినీతికి పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకున్నామని భారాస సభ్యుడు తాతామధుసూదన్ అడిగిన ప్రశ్నకు మంత్రి పొంగులేటి వివరణ ఇచ్చారు. ఈ కుంభకోణంలో సీసీఎల్ఏ అధికారుల పాత్ర ఉన్నట్టు తాతా మధు అనుమానం వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. "భువనగిరి జిల్లాలో రూ.3.99 కోట్లకు సంబంధించి కొందరు మీ సేవ నిర్వాహకులు అవినీతికి పాల్పడ్డట్టు అధికారులు గుర్తించారు. నలుగురిని అరెస్టు చేశాం. ఇందులో అధికారుల పాత్ర ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ ఏప్రిల్ చివరి నాటికి పూర్తిస్థాయిలో భూ భారతి పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తాం" అని పొంగులేటి వివరించారు.

# అసెంబ్లీలో మల్లారెడ్డి మార్క్ ప్రసంగం..

## డంపింగ్ యార్డ్ వాసన భరించలేకపోతున్నానంటూ ఆవేదన!

-3 పేజి తరువాయి
అని బాధపడుతున్నానని ఆయన వ్యాఖ్యానించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డును 'స్పెషల్ కేటగిరి' కింద అభివృద్ధి చేయాలని మల్లారెడ్డి డిమాండ్ చేశారు. అక్కడ పేరుకుపోయిన చెత్త గుట్టల వల్ల స్థానిక ప్రజలు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గంగా ఉన్న మేడ్చల్‌ను ముక్కలు ముక్కలు చేశారని అన్నారు. 61 గ్రామాలు, మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో కలిపేసి కేవలం 16 వార్డులుగా మార్చడం వల్ల అభివృద్ధి కుంటుపడిందని, కనీసం డ్రైనేజీలు, రోడ్లు కూడా సరిగ్గా లేవని మండిపడ్డారు.
జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబును ఉద్దేశించి మల్లారెడ్డి మాట్లాడుతూ... "శ్రీధరన్న.. జర నన్ను పగబట్టకే.. మా జిల్లా ఇంచార్జ్ మంత్రివి నువ్వే, మా మేడ్చల్ మీద కొంచెం కనికరం చూపించు" అంటూ తనదైన శైలిలో వేడుకున్నారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధికి జీహెచ్ఎంసీ నుంచి ప్రత్యేక నిధులు కేటాయించాలని విన్నవించారు. విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

# ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు నాణ్యమైన సేవలకు ప్రతీకలుగా నిలవాలి

**భద్రాద్రి పెన్ పవర్::** ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే ఆదర్శ కేంద్రాలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం అన్నపురెడ్డిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన, ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యా మరియు వైద్య సేవల అమలును సమగ్రంగా పరిశీలించారు. మొదటగా ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, మందుల గది, ప్రయోగశాల (ల్యాబ్), ఇన్‌పేషెంట్ విభాగం, స్టాక్ రిజిస్టర్, సిబ్బంది హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. అవుట్‌పేషెంట్ రిజిస్టర్‌ను పరిశీలించి, రోజువారీగా వచ్చే రోగుల సంఖ్యపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అవుట్‌పేషెంట్ వార్డులో ఉన్న ఒక బాలుడితో మాట్లాడి, కుక్క కాటు టీకా కోసం వచ్చినట్లు తెలుసుకుని, టీకాలు అందుబాటులో ఉన్నాయా అని విచారించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఏ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారో, అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉందా అనే అంశాలపై ఆరా తీశారు. తనిఖీ సమయంలో మెడికల్ అధికారి అందుబాటులో లేకపోవడంతో కారణాలను ప్రశ్నించగా క్షేత్రస్థాయిలో పర్యటనలో ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. వెంటనే మెడికల్ అధికారిని పిలిచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొంతమంది సిబ్బంది యూనిఫాం (ఆప్రాన్) ధరించకపోవడాన్ని గమనించి, విధి సమయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. సిబ్బంది డిప్యూటేషన్‌పై అధిక సంఖ్యలో విధులు నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తించి, దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని ఆదేశించారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. పదవ తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలిస్తూ, ఇటీవల జరిగిన ఇంగ్లీష్ పరీక్షపై విద్యార్థులను అడిగి తెలుసుకుని, రాబోయే గణిత పరీక్షకు క్రమబద్ధంగా సిద్ధం కావాలని సూచించారు.
ఉపాధ్యాయులు ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించి, సులభ పాఠాలను పునరావృతం చేయిస్తూ విద్యార్థులను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అని తనిఖీ చేశారు. మెనూలో ఉన్న కొన్ని పదార్థాలు లేకపోవడంపై కారణాలు అడిగి తెలుసుకుని, వడ్డించిన ఆహారాన్ని తిని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. వంటల్లో ఉప్పు అధికంగా ఉన్నట్లు గమనించి, సరిపడ మోతాదులో మాత్రమే వినియోగించాలని సూచించారు. విద్యార్థులకు పోషకాహారం అందించాలంటే మెనూ ప్రకారం అన్ని పదార్థాలు తప్పనిసరిగా వండాలని స్పష్టం చేశారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, కూరగాయల నాణ్యతను తనిఖీ చేశారు. ఎండాకాలంలో కూరగాయలు త్వరగా పాడయ్యే అవకాశం ఉన్నందున తాజా, నాణ్యమైన కూరగాయలను మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. మెనూలో ఉన్న బీట్‌రూట్, పాలకూర అందుబాటులో లేకపోవడంపై ప్రశ్నించారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు గురించి విచారించి, ఆర్ ఓ ప్లాంట్ నుంచి వచ్చే వేస్ట్ వాటర్‌ను శుభ్రత పనులకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో ట్యాపుల లీకేజీ గమనించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాసంస్థలు మరియు ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే ముఖ్య కేంద్రాలని తెలిపారు . విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం, పరిశుభ్ర వాతావరణం కల్పించడం అత్యవసరమని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు క్రమబద్ధంగా చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఉపాధ్యాయులు వారికి సమగ్ర మార్గదర్శనం అందించాలని
సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి రోగికి సమయానుకూలంగా వైద్య సేవలు, ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడాలని, టీకాలు మరియు అత్యవసర మందులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను వేగంగా ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించేలా అంబులెన్స్ సేవలు సిద్ధంగా ఉండాలని, రిఫరల్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ పాటిస్తూ యూనిఫాం నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని, బాధ్యతాయుతంగా సేవలు అందించాలని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన విద్యా, వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోదని, లోపాలు గుర్తించిన పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మెడికల్ అధికారి ప్రియాంక, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**వనపర్తి పెన్ పవర్:** మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిపై నేరం రుజువుకావడంతో, వనపర్తి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్. సునీత నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.30,000 జరిమానా విధిస్తూ ఈ రోజు తీర్పునిచ్చారని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు.

**కేసు వివరాలు**

వనపర్తి జిల్లా గోపాల్‌పేట్ మండలం లక్ష్మితాండాకు చెందిన ఒక మైనర్ బాలిక (9వ తరగతి) ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న సమయంలో, అదే తండాకు చెందిన నిందితుడు ఆమెను బలవంతంగా గ్రామం బయటకు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక కనిపించకపోవడంతో తల్లిదండ్రులు వెతుకుతూ వెళ్లగా, గుట్ట దగ్గర ఏడుస్తూ ఉన్న బాలికను కనుగొన్నారు. జరిగిన ఘటనను బాలిక తన తల్లికి వివరించగా, తల్లి వెంటనే గోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.
వెంటనే కేసు నమోదు చేసిన గోపాల్‌పేట్ ఎస్సై, రామన్ గౌడ్, అప్పటి సీఐ, సూర్య నాయక్ ఆధ్వర్యంలో సమగ్ర దర్యాప్తు సాంకేతిక ఆధారాలు, బాధితురాలి వాంగ్మూలం నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.
కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు.
ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసచారి సమర్థవంతంగా వాదనలు వినిపించడంతో, నేరం నిరూపితమైందని కోర్టు నిర్ధారించి కఠిన శిక్ష విధించింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ...సమాజాన్ని కుదిపేసే నేరాలకు పాల్పడిన వారిపై కోర్టులు కఠిన శిక్షలు విధించడం వల్ల నేరస్తుల్లో భయం పెరుగుతుంది.
ఇలాంటి తీర్పులు సమాజానికి రక్షణ కవచంలా పనిచేస్తాయి. నేరం చేయాలనే ఆలోచనకే భయపడేలా న్యాయవ్యవస్థ వ్యవహరిస్తోంది.
బాధితులకు న్యాయం అందించడంలో పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారు. ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా, ఏ అన్యాయం జరిగినా వెంటనే పోలీసులను సంప్రదించాలి.
ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటానికి కృషి చేసిన పోలీసు అధికారులను పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు సిబ్బంది అందరినీ జిల్లా ఎస్పీ అభినందించారు.

# మిషన్ భగీరథ నీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు

**హుస్నాబాద్, మార్చి 24 పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా, హుస్నాబాద్ పరిధిలోని అక్కన్నపేట మండలంలోని చౌటకుంట తండా, సేవాలాల్ మహారాజ్ తండాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో నిలిచిపోయిన నీటి సరఫరాను పునరుద్ధరించాలని సర్పంచులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు మంగళవారం విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. పనులు పూర్తయిన వెంటనే రెండు తండాలకు తాగునీటి సరఫరా సక్రమంగా జరుగుతుంది.

# లకుడారం గ్రామానికి సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

**దుబ్బాక, మార్చి 24 పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండల పరిధిలోని లకుడారం గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలపడమే లక్ష్యంగా గ్రామ సర్పంచ్ చిక్కుడు శిల్పా, నర్సింలు ఎన్ఆర్ఈజీఎస్ లో భాగంగా మంజూరైన నాలుగు లక్షల విలువైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి, మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దేవి రవీందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

**గద్వాల, మార్చి 24పెన్ పవర్:** మంగళవారం 44వ జాతీయ రహదారిపై ఉండవెల్లి స్టేజి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కరిమద్దుల గ్రామానికి చెందిన మాధవరెడ్డి (28), వరనాథ్ రెడ్డి (30) అనే ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. జాబ్ సెర్చింగ్ కోసం హైదరాబాద్ వెళుతుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. 108 సిబ్బంది క్షతగాత్రులను ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మాధవరెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

# ఆసుపత్రిలో మహిళ నుంచి రూ.లక్షల చోరీ?

**ఆలంపూర్, మార్చి 24పెన్ పవర్:** గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ మహిళ వద్ద ఉన్న రూ.14 లక్షల నగదు, రెండు తులాల బంగారం ఆసుపత్రి సిబ్బంది దొంగిలించారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మక్తల్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఇంటి నిర్మాణానికి దాచుకున్న డబ్బును తన తల్లికి ఇచ్చి గ్రామానికి పంపగా, ఆమె పరధ్యానంలో గద్వాల బస్సు ఎక్కింది. కల్లుతాగి అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను ఆసుపత్రిలో చేర్పించగా, ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై గద్వాల, మక్తల్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. దొంగిలించిన సిబ్బందిలో ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. అయితే, పోలీసులు ఈ విషయాన్ని ఇంకా ధ్రువీకరించలేదు.

# కాంగ్రెస్ పార్టీ హామీలు అమలులో విఫలం అయింది..

**మక్తల్, మార్చి 24పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కోరుతూ మక్తల్ నియోజకవర్గం బీఆర్ఎస్, ఃఖీూఎ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మక్తల్ బీఆర్ఎస్‌యువ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో జుట్లసాగర్, శివారెడ్డి, రఘు, ఆనంద్, రాజు, సాదిక్ తదితరులు ఉన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, కాంగ్రెస్ పార్టీ అబద్ధాలపై చేస్తున్న పాలన మరికొద్ది రోజుల్లో ముగియబోతోందని వారు అన్నారు.

# ఇసుక ట్రాక్టర్లు పట్టివేత.. కేసు నమోదు.!

**నారాయణపేట, మార్చి 24పెన్ పవర్:** నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని ఏక్లాస్ పూర్ మన్నేవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. యజమానులైన బండారి నరేష్, కల్వల ఆంజనేయులు, బండారి తిరుమలేష్ లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాము తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని, అక్రమ దందాలపై నిరంతరం నిఘా ఉంటుందని ఆయన హెచ్చరించారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడులు.. 11 మంది అరెస్ట్!

**నారాయణపేట, మార్చి 24పెన్ పవర్:** నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం నర్వ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామశివారులో రాత్రి పేకాట ఆడుతున్న స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు, నర్వ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాటలో పాల్గొంటున్న 11 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 1, 22,900 నగదు, 9 మోటార్ సైకిళ్లు, 11 సెల్ ఫోన్లు, పేకాట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసునమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ పబ్బతి రమేష్ హెచ్చరించారు.

# ఇంటి వద్దకే భద్రాచల శ్రీ సీతారాముల కళ్యాణ తలంబ్రాలు

**దేవరకొండ, మార్చి 24పెన్ పవర్:** శ్రీరామనవమి సందర్భంగా శ్రీ భద్రాచల సీతారామస్వామి కళ్యాణ మహోత్సవంలో ఉపయోగించిన పవిత్ర కోటి గోటి ముత్యాల కళ్యాణ తలంబ్రాలను భక్తులకు ఇంటి వద్దకే అందించేందుకు టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ ప్రత్యేక సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు దేవరకొండ డిపో మేనేజర్ విజయకుమారి, అసిస్టెంట్ మేనేజర్ సైదులు తెలిపారు. భక్తులకు సౌకర్యవంతంగా, నమ్మకంగా సేవలు అందించడమే టీజీఎస్ఆర్టీసీ లక్ష్యమని వారు పేర్కొన్నారు. భద్రాచలం వెళ్లలేని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మల్లారెడ్డి నిజాలు మాట్లాడుతారనుకుంటే మళ్లీ అవే అబద్ధాలు చెబుతున్నారు

-3 పేజి తరువాయి
ఉంచుకుని, డంపింగ్ యార్డుకు ప్రత్యామ్నాయ ప్రాంతాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. నగరంలో నలుమూలలా డంపింగ్ యార్డులు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు సంబంధించి కొన్ని వాస్తవాలు చెప్పారని అన్నారు. కానీ ఆయన ముందు, వెనుక, పక్కన కూర్చున్న వారి ప్రభావంతో నిజాలు చెప్పడానికి బదులు సైడ్ ట్రాక్ అయ్యారని అన్నారు. డంపింగ్ కోసం నగరం చుట్టుపక్కల మరో మూడు ప్రాంతాలను ఎంపిక చేయాలనుకుంటున్నామని అన్నారు.

# తెరపైకి కంటెస్టెడ్...

**నిజామాబాద్, మార్చి 24, పెన్ పవర్:** రాజకీయాల్లో గెలిచిన నేతలకే పదవి, పలుకుబడి, గౌరవం ఉంటాయి. పనులు చేయించేది, ప్రజల తరఫున సమావేశాల్లో ప్రశ్నించేది కూడా పదవిలో ఉన్నవారే. మెజారిటీ సీట్లు గెలిస్తే అధికారపక్షం అంటారు.. తక్కువ సీట్లు వస్తే ప్రతిపక్షంలో కూర్చుంటారు. ప్రజాస్వామ్యంలో ఇది కామన్. కానీ కరీంనగర్‌లో ఎన్నికల్లో ఓడిన నేతలు కూడా పెత్తనం చెలాయించే వ్యూహం రూపొదిస్తున్నారు. గెలిచిన ప్రజాప్రతినిధులతో సమానంగా 'కంటెస్టెడ్ ఎమ్మెల్యే', 'కంటెస్టెడ్ కార్పొరేటర్' గా స్వయంగా ప్రకటించుకుంటున్నారు. ఈమేరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వాహనాలకు స్టిక్కర్లు పెట్టుకుంటున్నారు. విజిటింగ్ కార్డులు ఇస్తున్నారు. ఈ వింత పరిణామం స్థానిక పాలనలో గందరగోళాన్ని సృష్టిస్తుంది.కరీంనగర్ కార్పొరేషన్‌లో 66 డివిజన్లు ఉన్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ కార్పొరేటర్ స్థానాలు గెలిచి పీఠం దక్కించుకుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య తీవ్ర పోటీ జరిగింది. అధికార కాంగ్రెస్ పీఠం కోసం సర్వశక్తులు ఒడ్డినా ప్రజలు కమలం వైపే మొగ్గుచూపారు. ఫలితాల తర్వాత కూడా బీఆర్ఎస్, స్వతంత్ర అభ్యర్థులను కలుపుకుని పీఠం కోసం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ప్రయత్నాలు చేశారు. కానీ బీఆర్ఎస్ హ్యాండ్ ఇవ్వడంతో కాంగ్రెస్ ఆశలు ఆవిరయ్యాయ. ఇక ఓడిపోయిన నాయకులు పార్టీలోని నామినేటెడ్ పదవుల కోసం పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో 'కంటెస్టెడ్' పేరుతో సొంతంగా లేని పదవులు సృష్టించుకుని అధికారం చెలాయించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం ఇది కొత్త ట్రెండ్‌గా మారింది. ఈమేరకు పెద్ద ఫ్లెక్సీలపై 'కంటెస్టెడ్' ఎమ్మెల్యే/కార్పొరేటర్' అని పేరుపెట్టి రోడ్లపై ఏర్పాటు. మానకొండూరు, కరీంనగర్ కార్పొరేషన్ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. కొందరు కార్లపై స్టికర్లు అంటించుకుని అధికారిక స్థాయిలో తిరుగుతున్నారు. మరికొందరు కలెక్టర్లు, ఎమ్మెల్యేల కార్యాలయాల్లో విజిటింగ్ కార్డులతో హాజరవుతుఆన్నరు. స్థానిక సమస్యల సమావేశాల్లో ప్రధాన అతిథులుగా పాల్గొంటున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఓడిపోయిన అభ్యర్థులు ఎక్కువగా ఈ వ్యవహారం నడిపిస్తున్నారు. కంటెస్టెడ్ ట్రెండ్‌ను గెలిచిన ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, అధికార దుర్వినియోగంగా పేర్కొంటున్నారు. పోలీసులకు ఫిర్యాదులు చేస్తూ, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పార్టీ స్థాయిలో డిసిప్లినరీ చర్యలు, పబ్లిక్ హెచ్చరికలు జారీ అవుతున్నాయి. ప్రజల్లో గందరగోళం పెరిగి, నిజ అధికారులను గుర్తించడం కష్టమవుతోంది.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ. వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఆదాయం పెరగాలి.. అభివృద్ధి జరగాలి

**జనగామ, మార్చి 24 పెన్ పవర్:** వరంగల్, హనుమకొండ నగరాలు వేగంగా విస్తరిస్తున్నాయి. శివారు కాలనీల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఏటికేడు వ్యాపార, వాణిజ్య భవనాలు, నివాస గృహాలు వెలుస్తున్నాయి. గ్రేటర్ వరంగల్ ఆదాయం మాత్రం పెరగడం లేదు. సొంత ఆదాయం పెంపుపై పాలకవర్గం, అధికారులకు పట్టింపు లేకుండా పోయింది. గత రెండు, మూడేళ్లలో పరిశీలిస్తే బల్దియా వార్షిక పద్దు(బడ్జెట్)లో అంకెలు మారుతున్నాయి. వాస్తవ ఆదాయంలో మాత్రం పెరుగుదల లేదు. సొంత ఆదాయం పెరగక పోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పని విశ్రాంత అధికారులు అంటున్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, మేయర్, కమిషనర్, కార్పొరేటర్లు వింగ్ అధికారులు ఆదాయం పెంచే మార్గాలు అన్వేషించాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

## రెక్కలు ముక్కలు.. మద్దతు లేని మక్కలు

**మహబూబాబాద్, మార్చి 24 పెన్ పవర్:** రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన మొక్కజొన్న దిగుబడులను విక్రయించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. గిట్టుబాటు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆశతో పండించిన అన్నదాతలకు నిరాశే మిగిలింది. దీంతో దళారులను ఆశ్రయిస్తుండగా వారు అందినకాడికి దోచుకుంటున్నారు. పంట కోతకు వచ్చి పక్షం రోజులవుతున్నా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాలుకు రూ. 2,400 మద్దతు ధరగా ప్రకటించింది. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. వారు క్వింటాకు రూ. 1,600 నుంచి రూ. 1,800 వరకు కొంటుండటంతో రైతులు క్వింటాకు రూ. 600 నుంచి రూ. 800 వరకు నష్టపోతున్నారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు

**సిద్ధిపేట, మార్చి 24 పెన్ పవర్:** సిద్ధిపేట జిల్లాలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ మహిళను కుకునూరుపల్లి పోలీసులు సకాలంలో స్పందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. సుజాత అనే మహిళ తన ఇంటికి వచ్చి ఉరివేసుకునేందుకు ప్రయత్నించగా, డయల్ 100కు సమాచారం అందడంతో పోలీసులు మెరుపు వేగంతో స్పందించి ఆమెను రక్షించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐపీఎస్ ఆయేషా ఫాతిమా మాట్లాడుతూ, క్షణికావేశంలో ఆత్మహత్య వంటి కఠిన నిర్ణయాలు తీసుకోవద్దని, సమస్యలను చట్టపరంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

## కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య

**గజ్వేల్, మార్చి 24 పెన్ పవర్:** సిద్దిపేటలో కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నకోడూరు సర్పంచ్ కుమారుడు దిలీప్ (28) ఆరు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఉరివేసుకున్నాడు. దిలీప్ కు మూడేళ్ల క్రితం వివాహం కాగా, రెండేళ్ల బాబు ఉన్నాడు. అతను ఓ పెట్రోల్ బంక్ ను లీజుకు తీసుకొని నిర్వహిస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అర్ధరాత్రి అగ్ని ప్రమాదం.. ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం

**నర్సాపూర్, మార్చి 24 పెన్ పవర్:** తూప్రాన్ పట్టణంలో అర్ధరాత్రి చంద్రశేఖర్ రెడ్డికి చెందిన ఎలక్ట్రిక్ బైక్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటల్లో చిక్కుకుంది. నర్సాపూర్ చౌరస్తా వద్ద ఛార్జింగ్ పెట్టి ఇంటికి తీసుకెళ్లిన బైక్, అర్ధరాత్రి దాటిన తర్వాత అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బైక్‌తో పాటు భవనానికి సంబంధించిన డ్రైనేజ్ పైపులు, విద్యుత్ పైపులు కూడా కాలిపోయాయి. మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నాలు విఫలమయ్యాయి.

## అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో బీఆర్ఎస్వీ నేతలు అరెస్ట్

**జహీరాబాద్, మార్చి 24 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా, జహీరాబాద్ నియోజకవర్గంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి ముందు బీఆర్ఎస్వీ సీనియర్ నాయకులు ఓంకార్, ఫయాజ్‌లను పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. వారిని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులతో ప్రజా వ్యతిరేకతను ప్రభుత్వం తప్పించుకోలేదని, విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అరెస్టులతో ఉద్యమాలను అణగదొక్కలేరని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని నేతలు కోరారు.

## రామాలయానికి పంచలోహ విగ్రహాలు మంజూరు చేయాలని వినతి

**నారాయణఖేడ్, మార్చి 24 పెన్ పవర్:** సిద్దిపేట జిల్లాలోని లకుడారం గ్రామంలో అసంపూర్తిగా ఉన్న శ్రీ రామాలయానికి ప్రభుత్వ దేవాదాయ శాఖ నుండి నిధులు మంజూరు చేయాలని, అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం నుండి పంచలోహ విగ్రహాలు ఇప్పించాలని లకుడారం సర్పంచ్ శిల్పానర్సింలు దేవాదాయ శాఖ కమిషనర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి దేవి రవీందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదాయంలో రంగారెడ్డే టాప్...

**హైదరాబాద్, మార్చి 24, పెన్ పవర్:** తెలంగాణలో అత్యధిక సంపన్న జిల్లాల జాబితాలో హైదరాబాద్ మరోసారి రెండో స్థానంలో నిలిచింది. తెలంగాణ సోషియో ఎకనామిక్ అవుట్‌లుక్ 2026 నివేదిక ప్రకారం, హైదరాబాద్ జిల్లాకు తలసరి ఆదాయం రూ. 4,76,679గా నమోదై, రాష్ట్ర సగటు రూ. 3,80,031 కంటే ఎక్కువగా ఉంది.తలసరి ఆదాయం అంటే ఒక జిల్లాలో ప్రతి వ్యక్తి సంవత్సరానికి సగటున సంపాదించే ఆదాయం. ఇది ఆ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలను అంచనా వేయడానికి కీలక సూచికగా భావిస్తారు. ఇక జీడీపీ అంటే జిల్లాలో ఉత్పత్తి అయ్యే మొత్తం ఆర్థిక విలువ. ఇది ఆర్థిక పరిమాణాన్ని చూపుతుందిగానీ, వ్యక్తిగత ఆదాయాన్ని ప్రతిబింబించదు.



**తెలంగాణలో టాప్ 10 ధనిక జిల్లాలు (తలసరి ఆదాయం ఆధారంగా):**

తెలంగాణలో తలసరి ఆదాయం ఆధారంగా టాప్ 10 జిల్లాల జాబితా ఇలా ఉంది:

1. రంగారెడ్డి రూ. 11,29,735
2. హైదరాబాద్ రూ. 4,76,679
3. సంగారెడ్డి రూ. 3,94,587
4. మేడ్చల్ మల్కాజిగిరి రూ. 3,81,506
5. భద్రాది కొత్తగూడెం రూ. 3,69,420
6. మహబూబ్‌నగర్ రూ. 3,36,898
7. ములుగు రూ. 3,35,509
8. యాదాద్రి భువనగిరి రూ. 3,35,264
9. నల్గొండ రూ. 3,30,216
10. మెదక్ రూ. 3,29,209

ఈ జాబితాలో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో నిలవడం గమనార్హం.

+ణణూలో కూడా హైదరాబాద్ రెండో స్థానం:

జిల్లా ఆర్థిక పరిమాణాన్ని సూచించే +ణణూ పరంగా కూడా హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. +ణణూ ఆధారంగా టాప్ 10 జిల్లాలు:

1. రంగారెడ్డి రూ. 3,41,080 కోట్లు
2. హైదరాబాద్ రూ. 2,25,860 కోట్లు
3. మేడ్చల్ మల్కాజిగిరి రూ. 1,16,133 కోట్లు
4. సంగారెడ్డి రూ. 74,194 కోట్లు
5. నల్గొండ రూ. 64,219 కోట్లు
6. నిజామాబాద్ రూ. 49,974 కోట్లు
7. భద్రాది కొత్తగూడెం రూ. 48,354 కోట్లు
8. ఖమ్మం రూ. 47,184 కోట్లు
9. సూర్యాపేట్ రూ. 38,865 కోట్లు
10. సిద్దిపేట రూ. 37,495 కోట్లు

హైదరాబాద్ నగరానికి వెలుపల ఉన్న ప్రాంతాల్లో వేగంగా అభివృద్ధి జరగడం వల్ల రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం, +ణణూ రెండింటిలోనూ ముందంజలో ఉంది. ఐటీ, రియల్ ఎస్టేట్, పరిశ్రమల విస్తరణ ఈ జిల్లాలో భారీ ఆర్థిక వృద్ధికి దోహదపడుతున్నాయి.

రంగారెడ్డి జిల్లా జనాభా: 24,26,243

హైదరాబాద్ జిల్లా జనాభా: 39,43,323

హైదరాబాద్ జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ, రంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి వేగం ఎక్కువగా ఉండటం వల్ల ఆర్థికంగా అది ముందంజలో ఉంది. తలసరి ఆదాయం, జీడీపీ పరంగా హైదరాబాద్ రెండో స్థానంలో నిలవడం నగర ఆర్థిక శక్తిని ప్రతిబింబిస్తోంది. అయితే వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగారెడ్డి జిల్లా తెలంగాణలో ఆర్థిక కేంద్రంగా మారుతున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.

# డిస్కంలకు సింగరేణి షాక్

**ఖమ్మం, మంచిర్యాల, మార్చి 24, పెన్ పవర్:** సింగరేణి సంస్థ మంచిర్యాల జిల్లా పెగడపల్లిలో నిర్మిస్తున్న 800 మెగావాట్ల కొత్త థర్మల్ ప్లాంట్ విద్యుత్తును తెలంగాణకు కాకుండా రాజస్థాన్‌కు విక్రయించాలని నిర్ణయించింది. ఇందుకోసం రాజస్థాన్ జెన్‌కోతో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేస్తోంది. తెలంగాణ డిస్కంలు చెల్లించాల్సిన రూ. 27,379 కోట్ల భారీ బకాయిలే ఈ నిర్ణయానికి కారణమని తెలుస్తోంది. ఈ పరిణామం భవిష్యత్తులో తెలంగాణకు కరెంట్ కష్టాలతో పాటు వేల కోట్ల అదనపు ఆర్థిక భారాన్ని మోపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ షాక్ ఇచ్చింది. రాష్ట్ర విద్యుత్ అవసరాల కోసం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పెగడపల్లిలో కొత్తగా నిర్మించ తలపెట్టిన 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ విద్యుత్తును ఇప్పుడు రాజస్థాన్‌కు విక్రయించాలని సింగరేణి నిర్ణయించింది. దశాబ్దాలుగా తెలంగాణ గనుల నుంచి బొగ్గు తీస్తూ రాష్ట్ర పారిశ్రామిక, వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలిచిన సింగరేణి.. ఇప్పుడు తన సొంత రాష్ట్ర డిస్కంలకు కాకుండా పొరుగు రాష్ట్రమైన రాజస్థాన్ విద్యుదుత్పత్తి సంస్థతో జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటుకు సిద్ధమవ్వడం చర్చనీయాంశంగా మారింది.ప్రధానంగా ఆర్థిక కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలు కొండలా పేరుకుపోయాయి. ప్రస్తుతం ఉన్న 1200 మెగావాట్ల ప్లాంటు నుంచి సరఫరా అవుతున్న విద్యుత్తుకు సంబంధించి డిస్కంలు దాదాపు రూ. 27,379 కోట్ల మేర బకాయిలు పడ్డాయి. ఈ భారీ ఆర్థిక లోటు వల్ల సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉండటంతో కొత్త ప్లాంటు విద్యుత్తును నగదు చెల్లింపులు సక్రమంగా చేసే ఇతర రాష్ట్రాలకు, ఓపెన్ మార్కెట్‌కు మళ్లించాలని సింగరేణి భావించినట్లు తెలిసింది. రాజస్థాన్‌కు థర్మల్ విద్యుత్ ఇచ్చి.. దానికి బదులుగా అక్కడ 1500 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, ఆ కరెంటును వినియోగించుకోవాలనే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది.అయితే, ఈ నిర్ణయం తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. రాష్ట్రానికి అదనపు థర్మల్ విద్యుత్ అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు ఇటీవలే రాష్ట్ర మంత్రివర్గం రామగుండంలో కొత్తగా 800 మెగావాట్ల థర్మల్ ప్లాంటు నిర్మాణానికి జెన్‌కోకు అనుమతి ఇచ్చింది. పెగడపల్లిలో ఇప్పటికే ఉన్న 1200 మెగావాట్ల ప్లాంటు పక్కనే కొత్త యూనిట్ నిర్మిస్తే భూసేకరణ భారం ఉండదు కాబట్టి మెగావాట్‌కు రూ. 12 కోట్ల ఖర్చుతోనే నిర్మాణం పూర్తవుతుంది. కానీ ఈ కరెంటును రాజస్థాన్‌కు అమ్మేసి భవిష్యత్తులో తెలంగాణ కోసం మరో చోట ప్లాంటు నిర్మించాలంటే మళ్లీ వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంటుంది. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై అదనంగా భారం పడటమే కాకుండా, ప్రాజెక్టు పూర్తి కావడానికి ఏళ్ల సమయం పడుతుంది. మరోవైపు, పర్యావరణ నిబంధనలు కఠినతరం అవుతున్న తరుణంలో బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలకు అనుమతులు రావడం కష్టతరమవుతోంది. చేతిలో ఉన్న అవకాశాన్ని వేరే రాష్ట్రానికి ధారాదత్తం చేస్తే.. భవిష్యత్తులో తెలంగాణ పారిశ్రామిక వృద్ధికి అవసరమైన చౌక విద్యుత్ లభ్యత తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు. సింగరేణి టెండర్ ప్రక్రియను వేగవంతం చేస్తూ కన్సల్టెన్సీ సంస్థల కోసం ప్రకటన జారీ చేయడంతో ఈ వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా కూడా దుమారం రేపుతోంది. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సమన్వయంతో బకాయిల సమస్యను పరిష్కరించుకుని ఈ 800 మెగావాట్ల విద్యుత్తును రాష్ట్ర అవసరాలకే వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# బలహీనమే తప్పు.. బల్కాదు!

**హైదరాబాద్, మార్చి 24, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయంలో అందరినీ తొలుస్తున్న ఏకైక ప్రశ్న గులాబీ బాస్‌ల అరెస్టు ఎప్పుడు? . గడప దాటిన ప్రతిచోటా, ప్రతి మీడియా సమావేశంలోనూ రేవంత్ రెడ్డికి ఎదురయ్యే ఈ ప్రశ్న వెనుక ఒక ఉత్కంఠ ఉంది. దానికి కారణం గతంలో రేవంత్ పై కేసీఆర్ చేసిన రాజకీయమే. అయితే, రేవంత్ రెడ్డి చట్టం తన పని తాను చేస్తుంది అనే వ్యూహమే పాటిస్తున్నారు. దీని వెనుక ఒక లోతైన రాజకీయ వ్యూహం దాగి ఉంది. ప్రత్యర్థులను జైలు పాలు చేయడం ద్వారా తక్షణ రాజకీయ మైలేజీ పొందడం కంటే, వారిని రాజకీయంగా నిరాయుధులను చేయడమే లక్ష్యంగా ఆయన అడుగులు వేస్తున్నారుఅరెస్టు అనేది రెండు అంచుల కత్తి. ఒక నాయకుడిని జైలుకు పంపడం ద్వారా అతడిని ప్రజల దృష్టిలో దోషిగా నిలబెట్టాలని అనుకుంటే, అది ఒక్కోసారి అతడిని రాజకీయ బాధితుడి గా మార్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా కేటీఆర్, కేసీఆర్ వంటి నేతల్ని అరెస్టు చేస్తే, అది సోషల్ మీడియా యుగంలో అనూహ్యమైన సానుభూతిని నింపుతుంది. అక్రమ కేసులు పెట్టారనే ప్రచారం జరిగితే, అది బీఆర్ఎస్‌కు సంజీవనిలా మారుతుందని రేవంత్ రెడ్డికి బాగా తెలుసు. అందుకే, ఆవేశంతో సంకెళ్లు వేయడం కంటే, ఆధారాలతో వారిని ప్రజల ముందు దోషులుగా నిలబెట్టడమే మేలని ఆయన భావిస్తున్నారు. కాళేశ్వరం వైఫల్యాలు, ఫోన్ ట్యాపింగ్ అక్రమాలను ప్రజల్లో నిరంతరం చర్చ జరిగేలా చూడటం ద్వారా వారి నైతిక పతనాన్ని శాశ్వతం చేయడమే రేవంత్ అసలు వ్యూహం.తెలుగు నేల రాజకీయ చరిత్ర రేవంత్ రెడ్డి ముందు స్పష్టమైన పాఠాలను ఉంచింది. గతంలో జగన్మోహన్ రెడ్డి 16 నెలల జైలు జీవితం ఆయనకు ప్రజల్లో ఒక విధమైన సానుభూతిని, తద్వారా అధికారాన్ని తెచ్చిపెట్టింది. చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో కూడా ప్రజల్లో వెల్లువెత్తిన మద్దతు, సానుభూతి పవనాలు రాజకీయ సమీకరణాలను మార్చేశాయి. కేసీఆర్ వంటి ప్రాంతీయ సెంటిమెంట్ ఉన్న నాయకుడిని అరెస్టు చేస్తే, అది మళ్లీ తెలంగాణ ఆత్మగౌరవం అనే సెంటిమెంట్‌ను రాజేసే అవకాశం ఉంది. తన పాలనపై దృష్టి పెట్టకుండా కేవలం పగ తీర్చుకుంటున్నారనే ముద్ర పడకుండా, రేవంత్ రెడ్డి అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు.నిజానికి కేటీఆర్‌ను చట్టపరమైన చిక్కుల్లో నెట్టే అవకాశాలు వచ్చినా రేవంత్ ఆచితూచి అడుగు వేయడం వెనుక ఉన్న పక్కా పొలిటికల్ లెక్క ఇదే. జైలు గోడల మధ్య ప్రత్యర్థిని ఒక పొలిటికల్ హీరోగా మార్చడం కంటే, బయటే ఉంచి వారిపై ఉన్న ఆరోపణలను ఎండగట్టడం ద్వారా వారి విశ్వసనీయతను దెబ్బతీయడం అత్యంత ప్రభావవంతమైన మార్గం. జైలుకు వెళ్తే వచ్చే సానుభూతి కంటే, బయట ఉండి సమాధానం చెప్పుకోలేక ఇబ్బంది పడటం వల్ల కలిగే నష్టమే ప్రత్యర్థికి ఎక్కువ. రేవంత్ రెడ్డి తీరు చూస్తుంటే ఆయన కేవలం ఒక దూకుడున్న నాయకుడిగానే కాకుండా, రాజకీయ చదరంగంలో ఎప్పుడు ఏ పావును కదపాలో తెలిసిన పరిణతి చెందిన నాయకుడిగా కనిపిస్తున్నారు.మొత్తానికి రేవంత్ రెడ్డి వ్యూహం స్పష్టంగా ఉంది. ప్రత్యర్థులను జైలులో ఉంచి బలవంతులుగా మార్చడం కంటే, వారి తప్పులను ప్రజల ముందు ఉంచి బలహీనపరచడమే సరైన మార్గమని ఆయన నమ్ముతున్నారు.

# అందుబాటులోకి జెన్ జీ కీ బోర్డు

**హైదరాబాద్, మార్చి 24, పెన్ పవర్:** స్తుత కాలంగా డిజిటల్ యుగంగా మారిపోయింది. ఇంటర్నెట్ జీవితాన్ని, పనిని అత్యంత సులభతరం చేసింది. ఇంటి నుండే దూరపు బంధువులతో సంప్రదించడం, మాట్లాడటం సులభమైంది. సాంకేతికత కారణంగా, గంటల సమయం పట్టే పనులు ఇప్పుడు నిమిషాల్లో పూర్తవుతున్నాయి. మొత్తమ్మీద, ప్రస్తుత కాలం డిజిటల్ కమ్యూనికేషన్ యుగం, కానీ సైబర్ మోసాలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్టులు వంటి సంఘటనలు ఈ డిజిటల్ కమ్యూనికేషన్‌కు అతిపెద్ద సవాలుగా మారాయి. దీనికి ప్రధాన కారణం అసురక్షిత డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు అంటే అప్లికేషన్‌లను ఉపయోగించడం. విదేశాల నుండి పనిచేసే డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సురక్షితం కాకపోవడమే పెద్ద సమస్య. అంటే, విదేశీ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించడం ద్వారా భారతదేశంలోని సామాన్య ప్రజలు సురక్షితంగా లేరని తాజా నివేదికలు చెబుతున్నాయి. అందువల్ల, ఇది జాతీయ భద్రతకు కూడా ముప్పుగా పరిగణించిందిఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, అనువాదిని ఏఐ సురక్షితమైన, నమ్మకమైన, పూర్తిగా స్వదేశీ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అందుబాటులోకి వచ్చింది. హైఫ్డ్ సంవాదిని, దేశీ ఏఐ జెన్‌జెడ్ కీబోర్డ్ యాప్‌ను అభివృద్ధి చేసింది. వీటిని లాంఛనంగా ప్రారంభించారు., దేశీ ఏఐ జెన్‌జెడ్ కీబోర్డ్ యాప్ప్రస్తుతం 80 కోట్లకు పైగా భారత పౌరులు విదేశీయులు నిర్వహిస్తున్న డిజిటల్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫారమ్‌లపై ఆధారపడి ఉన్నారు. డేటా భద్రత, గోప్యత, భాషా సమ్మిళితత్వం వంటి సమస్యలు కీలకమయ్యాయి. సురక్షితమైన, స్వదేశీ, గోప్యతపై దృష్టి సారించిన ప్రత్యామ్నాయాల అవసరం గతంలో కంటే ఇప్పుడు మరింత ముఖ్యమైనదిగా మారిపోయాయి.అధిక ప్రచారం పొందుతున్న సంవాదిని గురించి, అనువాదిని ఏఐ సీఈఓ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఇది భారతదేశపు మొట్టమొదటి సిమ్-ఆధారిత, బహుభాషా, స్పామ్-రహిత గ్లోబల్ మెసెంజర్ అని అన్నారు. ఈ ప్లాట్‌ఫామ్, డైనమిక్ చాట్ ఐడీల ద్వారా వినియోగదారులు తమ మొబైల్ నంబర్లను పంచుకోకుండానే వ్యక్తిగత చాట్‌లు, గ్రూప్ చాట్‌లు, ఆడియో కాల్‌లు, వీడియో కాల్‌ల ద్వారా సురక్షితంగా సంభాషించుకోవడానికి వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్, డివైస్-బైండింగ్, అధునాతన యాంటీ-స్పామ్ యంత్రాంగాలు దీనిని సైబర్ నేరాలు, మోసాలు, నకిలీ ఖాతాల నుండి సురక్షితంగా ఉంచుతాయని చంద్రశేఖర్ వెల్లడించారు.అనువాదిని ఏఐ అత్యంత ముఖ్యమైన ఫీచర్ గురించి మాట్లాడుతూ, 22 భారతీయ, 37 విదేశీ భాషలలో రియల్-టైమ్ టెక్స్ట్, వాయిస్ అనువాదాన్ని అందిస్తూ, దేశ భాషా వైవిధ్యాన్ని ఒక శక్తివంతమైన డిజిటల్ వారధిగా మారుస్తుందని సీఈఓ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ వివరించారు. ఇది 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని మరింత బలోపేతం చేస్తుందన్నారు. భద్రత కోసం హైఫ్డ్ సంవాదినిలో వన్-ట్యాప్ ూూూ అత్యవసర ఫీచర్ కూడా ఉందని, ఇది లైవ్ లొకేషన్‌తో తక్షణ సహాయాన్ని అందిస్తుందని ఆయన తెలిపారు. ఇది ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు, ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.హైఫ్డ్ సంవాదిని ప్రాంతీయ భాషలలో స్థానిక ఉపాధి, ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్, గిగ్ అవకాశాలను అందిస్తూ, యువతకు వారి సొంత వాతావరణంలోనే అవకాశాలను కల్పిస్తుందని చంద్రశేఖర్ వివరించారు. భాషా అభ్యాస మాడ్యూళ్లు, సామాజిక భాగస్వామ్యం, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ గేమ్‌ల వంటి ఫీచర్లు దీనిని కేవలం సమాచార మార్పిడికి మాధ్యమంగానే కాకుండా, భాగస్వామ్యం, అభివృద్ధికి కూడా ఉపయోగపడే ఒక సమగ్ర డిజిటల్ పర్యావరణ వ్యవస్థగా మారుస్తాయని తెలిపారు.దేశీ ఏఐ జెన్‌జెడ్ కీబోర్డ్ గురించి అనువాదిని ఏఐ సీఈఓ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ మాట్లాడుతూ, "ఇది ఒక అధునాతన ఏఐ-ఆధారిత టైపింగ్, ఎక్స్‌ప్రెషన్ ప్లాట్‌ఫామ్. ఇది 22 భారతీయ, 70కి పైగా విదేశీ భాషలలో టైపింగ్, వాయిస్-టు-టెక్స్ట్, తక్షణ అనువాదాన్ని అందిస్తుంది. ఈ కీబోర్డ్ వినియోగదారులకు వారి మాతృభాషలో నిరాటంకమైన, వేగవంతమైన, సమర్థవంతమైన కమ్యూనికేషన్ అనుభవాన్ని అందిస్తుంది." అని తెలిపారు.దేశీ ఏఐ జెన్‌జెడ్ కీబోర్డ్, జెన్‌జెడ్-శైలి స్లాంగ్ షార్ట్‌కట్‌ల వంటి అధునాతన ఫీచర్లను అందిస్తుంది. అధునాతన టైపింగ్ నియంత్రణలు, బహుళ లేఅవుట్‌లకు మద్దతు ఇస్తుంది. యాక్సెంట్‌లు, చిహ్నాలు, కరెన్సీలు దీనిని అత్యంత ఉపయోగకరంగా చేస్తాయి. అంతర్నిర్మిత క్లిప్‌బోర్డ్ మేనేజర్, +×ఖీలు, స్టిక్కర్లు, కస్టమ్ ూ× స్టిక్కర్ల వంటి ఫీచర్లు వినియోగదారు అనుభవాన్ని మరింత ఆకర్షణీయంగా, భావవ్యక్తీకరణకు సహాయపడుతుంది. దీని ఫ్లోటింగ్, పరిమాణాన్ని మార్చుకోగల, పూర్తిగా అనుకూలీకరించదగిన ఇంటర్‌ఫేస్ దీనిని వేగవంతంగా, సరళంగా, యూజర్-ఫ్రెండ్లీగా చేస్తుంది.

# తెలంగాణ కేబినెట్‌లో ఒకరిద్దరు మంత్రులు ఔట్..

## మంత్రివర్గంలోకి కొత్త నేతలు.. హైకమాండ్ బిగ్ ప్లాన్!



**హైదరాబాద్, మార్చి 24, పెన్ పవర్:** తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ సిద్ధమైంది. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో ఒకరిద్దరికి కేబినెట్ నుంచి ఉద్వాసన పలకనున్నారు. వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది. అయితే సామాజిక వర్గ సమీకరణాలను పరిగణలోకి తీసుకుని.. ఎవరిని తొలగిస్తున్నారో వారిని అదే సామాజిక వర్గ నేతతో భర్తీ చేయనున్నారు.తెలంగాణ రాష్ట్ర కేబినెట్‌లో మార్పులు జరగనున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన విషయంలో కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం కేబినెట్‌లో కొనసాగుతున్న మంత్రుల్లో ఒకరు, లేదా ఇద్దరిని తప్పించి.. వారి స్థానంలో కొత్త వారిని తీసుకురావాలని యోచిస్తున్నట్లు సమాచారం. మంత్రి పదవుల నుంచి తప్పించిన వారికి ప్రమోషన్లు ఇచ్చి పార్టీలో ఉన్నత పదవులు కట్టబెట్టాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఏ సామాజిక వర్గ మంత్రిని తొలగిస్తున్నారో.. కొత్తగా అవకాశం కల్పించే వారిని కూడా అదే సామాజిక వర్గం నుంచి తీసుకురావాలని తెలుస్తోంది.ఇక మంత్రివర్గం నుంచి తీసేసిన వారిని వారి సీనియారిటీని ఆధారంగా చేసుకుని.. సీడబ్ల్యూసీ, ఏఐసీసీ పదవులు ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనికి సంబంధించి ఆయా మంత్రులకు ఇప్పటికే పార్టీ హైకమాండ్ సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. అందుకు ఆ నేతలు కూడా సానుకూలంగానే అంగీకరించినట్లు హస్తం పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత మంత్రులను తప్పించడంతోపాటు.. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న మరో 2 మంత్రి పదవులను కూడా భర్తీ చేసేందుకు ముహూర్తం ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది.అయితే మంత్రి వర్గంలో మార్పులు, చేర్పులు చేసేందుకు ఆయా జిల్లాల ప్రాతినిథ్యం, సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకుని చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భావిస్తోంది. కేబినెట్ విస్తరణపై పార్టీలో అంతర్గత వివాదాలు రాకుండా ఉండేందుకు పక్కాగా ప్రణాళికలు చేస్తోంది. తప్పించిన మంత్రుల స్థానాలను అదే వర్గానికి చెందిన ఎమ్మెల్యేలతోనే భర్తీ చేయాలనే నిర్ణయించినట్లు సమాచారంఇక మంత్రి పదవుల నుంచి తప్పించిన వారు.. అవమానంగా భావించకుండా ఉండేందుకు.. వారికి ఉన్నత పదవులు ఇచ్చి హైకమాండ్ భావిస్తున్నట్టు చర్చ జరుగుతోంది. అలాంటి వారికి పార్టీలో కీలకమైన, గౌరవప్రదమైన సీడబ్ల్యూసీ, ఏఐసీసీ పదవులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక మంత్రివర్గ విస్తరణలో బీసీ, ఎస్టీ వర్గాలకు ప్రాధాన్యం కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది.ఇందులో భాగంగానే బీసీల్లో సంఖ్యాబలం ఎక్కువ ఉన్న మున్నూరు కాపులు, ఎస్టీల్లో ఎక్కువ జనాభా ఉన్న లంబాడీలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు కాంగ్రెస్ నేతల్లో తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఈసారి శాసనమండలి నుంచి బీసీ సామాజికవర్గానికి చెందిన ఓ నేతకు కూడా మంత్రి పదవి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఆ నేతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చే సమయంలోనే మంత్రి పదవి ఇస్తామని స్వయంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్లు సమాచారం.కేబినెట్‌లో మార్పుల సందర్భంగానే చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులను కూడా భర్తీ చేయాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. ఇందులో భాగంగానే అసెంబ్లీ, మండలి విప్‌ల నియామకాలు ఇటీవలె చేపట్టినా.. చీఫ్ విప్ నియామకాలను మాత్రం వాయిదా వేసినట్లు చర్చ జరుగుతోంది. మంత్రి పదవి రాని సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు కేబినెట్ హోదా ఉండే చీఫ్ విప్ పదవి ఇవ్వాలని భావిస్తున్నారు.డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవిని ఇస్తున్నట్టు గతేడాది జూన్‌లో ప్రకటించగా.. తనకు ఆ పదవి ఇష్టం లేదని.. మంత్రి పదవి కావాలని ఆయన కాంగ్రెస్ పెద్దలకు తేల్చి చెప్పేశారు. దీంతో ఇంతవరకు కూడా డిప్యూటీ స్పీకర్ నియామకం జరగలేదు. చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులకు కేబినెట్ హోదా ఉండటంతో మంత్రివర్గ విస్తరణ సందర్భంగా వీటిని కూడా భర్తీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది.

# తెలంగాణకు ప్రధాని నరేంద్ర మోడీ...



**హైదరాబాద్, మార్చి 24, పెన్ పవర్:** ప్రధాని నరేంద్ర మోదీ ఏప్రిల్ మొదటి వారంలో తెలంగాణలో పర్యటించనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు, మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసేందుకు హైదరాబాద్‌కు రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా నగరంలో నిర్వహించే ఒక భారీ బహిరంగ సభకు ఆయన హాజరవుతారు. అక్కడి నుంచే వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుడతారని సమాచారం. లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రధాని మోదీ తెలంగాణకు రావడం ఇదే తొలిసారి కావడంతో, ఈ పర్యటనపై రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 8 స్థానాల్లో విజయం సాధించి సత్తా చాటిందిఈ పర్యటనలో భాగంగా వరంగల్‌లోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బీబీనగర్ ఎయిమ్స్ లో కొత్తగా నిర్మించిన పలు బ్లాకులు, అలాగే పూర్తయిన జాతీయ రహదారులను ప్రధాని ప్రారంభించనున్నారు. వీటితో పాటు, హైదరాబాద్ నుండి యాదాద్రి వరకు ప్రతిపాదించిన ఎంఎంటీఎస్ రెండో దశ రైల్వే ప్రాజెక్టుకు, ప్రాంతీయ వలయ రహదారి ఉత్తర భాగానికి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాయని భావిస్తున్నారు.ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనపై పార్టీ పరంగా సమాచారం రావడంతో ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి. సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో శనివారం జరిగిన పార్టీ నేతల సమావేశంలో ఈ విషయంపై ప్రాథమికంగా చర్చించారు. ప్రధాని మోదీ అధికారిక పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, కార్యక్రమాల టైమింగ్స్‌పై కేంద్ర ప్రభుత్వం నుండి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు కొత్తగా ఏర్పాటైన సైబరాబాద్ కార్పొరేషన్, మల్కాజిగిరి కార్పొరేషన్లకు త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ కీలక సమయంలో ప్రధాని మోదీ రాష్ట్రానికి రానుండటంతో తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది.

## ఖమ్మం కలెక్టరేట్ వద్ద దివ్యాంగుల నిరసన



**ఖమ్మం, మార్చి 24 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గత 14 ఏళ్లుగా బైక్ స్టాండ్ నిర్వహిస్తున్న 15 మంది దివ్యాంగుల కుటుంబాలు తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశాయి. తమకు ముందస్తు సమాచారం లేకుండానే, స్టాండ్ నిర్వహణను ఇతరులకు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. దీనివల్ల తామంతా రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని, మానవతా దృక్పథంతో కలెక్టర్ స్పందించి, పాత పద్ధతిలోనే తమకే కేటాయించాలని వారు వేడుకుంటున్నారు.

## ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

**వైరా, మార్చి 24 పెన్ పవర్:** వైరా మండలంలోని శ్రీ పులిగొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలక మండలి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేసింది. ఆలయ కమిటీ చైర్మన్ గా ఈవూరి వెంకటేశ్వరరావుతో పాటు పాలక మండలి సభ్యులు ప్రమాణం చేశారు. అనంతరం ఆలయ, రోడ్ల అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏంఎసీ చైర్మన్ బొళ్ల గంగారావు, వైద్య విభాగ అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ, సర్పంచ్ మేడూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా స్వామివారి వసంతోత్సవం

**పాలేరు, మార్చి 24 పెన్ పవర్:** ఖమ్మం నగరంలోని 4వ డివిజన్లో గల స్వయంభూ శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి 22వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజు వసంతోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. అనంతరం స్వామివారికి లక్ష తులసి దళ అర్చనను వేదమంత్రోచ్చరణల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ అల్లిక అంజయ్యతో పాటు కమిటీ సభ్యులు కొండలరావు, సత్యం, కొమరయ్య, చంద్రయ్య, జ్యోతిరెడ్డి, వీరన్న పాల్గొన్నారు.

## అమెరికా దాడులకు వ్యతిరేకంగా నిరసన

**సత్తుపల్లి, మార్చి 24 పెన్ పవర్:** అమెరికా సామ్రాజ్యవాదం, యుద్ధోన్మాదం, ఆర్థిక దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల 95వ అమరత్వ వార్షికోత్సవం సందర్భంగా ఖమ్మంలో ర్యాలీ నిర్వహించి, భగత్ సింగ్ విగ్రహానికి నివాళులర్పించారు. మోదీ ప్రభుత్వం వెంటనే అమెరికా-భారత్ వ్యవసాయ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## ఫకీర తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**మహబూబాబాద్, మార్చి 24 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా నరసింహపేట మండలంలోని ఫకీర తండా గ్రామపంచాయతీ పరిధిలో, 15వ ఆర్థిక సంఘం ఎంపీటీసీ గ్రాంట్ నిధులతో రూ.3.70 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ గుగులోతు కైలా రవిమంగళవారం ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణంతో గ్రామ ప్రజల రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని, గ్రామాభివృద్ధికి ఇలాంటి పనులు మరింత ప్రాధాన్యతతో చేపడతామని ప్రజాప్రతినిధులు తెలిపారు. స్థానికులు అభివృద్ధి కార్యక్రమాలకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కిషన్ నాయక్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## సీతారామచంద్రుడికి కళ్యాణ వస్త్రాలు, హుండీల బహుకరణ

**వర్ధన్నపేట, మార్చి 24 పెన్ పవర్:** వర్ధన్నపేట నియోజకవర్గం కాజీపేట మండలం మడికొండ గ్రామంలోని శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ సీతారామ స్వామి దేవస్థానం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధిక రెడ్డి నరోత్తం రెడ్డి దంపతులు సీతారామచంద్రమూర్తికి కళ్యాణ వస్త్రాలు, అర్చకులకు దీక్ష వస్త్రములు మంగళవారం బహుకరించారు. అలాగే శ్రీ గోక కల్పన కరుణాకర్ దంపతులు 1,70,000 విలువైన రెండు హుండీలను దేవస్థానానికి బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సత్యనారాయణ, అర్చకులు పరాశరాం విష్ణువర్ధనాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## వల్మీడిలో వైభవంగా శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

**ములుగు, మార్చి 24 పెన్ పవర్:** తెలంగాణలోని రెండో భద్రాద్రిగా పేరుగాంచిన వల్మీడి గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయం నుంచి స్వామివారిని ప్రత్యేక సేవా కార్యక్రమాలతో కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. భజన బృందాల కోలాటాలు, మహిళల మంగళ హారతుల మధ్య ఈ వేడుకలు అట్టహాసంగా సాగాయి. ఈ ఉత్సవాల్లో ఆలయ అర్చకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# కాప్సిలో ఘనంగా ముగిసిన పంచమి వేడుకలు

**ఆదిలాబాద్, మార్చి 24 పెన్ పవర్:** బేల మండలం కాప్సి గ్రామంలో ఐదు రోజులుగా జరిగిన పంచమి వేడుకలు మంగళవారం ఘనంగా ముగిశాయి. సంత్ నానాజీ మహారాజ్ పల్లకితో భక్తులు గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పదుల సంఖ్యలో భజన బృందాలు పాల్గొని భక్తి పాటలు, నృత్యాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. అనంతరం జరిగిన దాహిహండి కాల కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ముత్తూట్ ఫైనాన్స్ లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

**బోథ్, మార్చి 24 పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ ఉ కామర్స్ నందు రేపు ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డా.అతీక్ బేగం మంగళవారం తెలిపారు. 2020 నుండి 2025 మధ్య డిగ్రీ పూర్తి చేసుకున్న, 28 ఏళ్ల లోపు వయస్సు గల అభ్యర్థులు అర్హులు. ఎంపికైన వారికి నెలకు రూ.14,000 నుండి రూ.18,000 జీతంతో పాటు ఇతర అలవెన్సులు, ఆదిలాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో పోస్టింగ్ లభిస్తుంది. ఆసక్తి గలవారు తమ రెస్యూమ్, ఆధార్ కార్డులతో ఈ నెల 26న ఉదయం 10 గంటలకు కళాశాల ప్రాంగణంలో హాజరు కావాలి అన్నారు.

# దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోరుతూ అసెంబ్లీ వరకు ర్యాలీ

**నిర్మల్, మార్చి 24 పెన్ పవర్:** తెలంగాణలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని బీజేపీ శాసనసభ పక్ష ఉపనేత, అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మంగళవారం డిమాండ్ చేశారు. వేలాది మంది దివ్యాంగులతో కలిసి ఆయన ఎమ్మెల్యే క్వార్టర్స్ నుండి అసెంబ్లీ వరకు ర్యాలీ నిర్వహించారు. దివ్యాంగుల రిజర్వేషన్లను సమర్థవంతంగా అమలు చేయాలని, పెన్షన్లు పెంచాలని, అర్హులందరికీ వెంటనే మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ దివ్యాంగుల సంఘం నాయకులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, శాసనసభలో ప్రస్తావించి పరిష్కారం సాధించాలని వినతిపత్రం సమర్పించారు.

## మంత్రి వాకిటి శ్రీహరిను కలిసిన బోథ్ ఎమ్మెల్యే



**ఖానాపూర్, మార్చి 24 పెన్ పవర్:** బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, రాష్ట్ర మంత్రి వాకటి శ్రీహరిని శనివారం కలిసి, బోథ్ లో మినీ స్టేడియం, ఇచ్చోడ మండల కేంద్రంలో గల ఇండోర్ స్టేడియం బ్యాలన్స్ వర్క్ కొరకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. బోథ్ నియోజకవర్గంలోని యువతను ప్రోత్సహించడానికి మినీ స్టేడియం తప్పనిసరి అని, దాని మంజూరుకు కోరారు. ఈ విషయాలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

**ముథోల్, మార్చి 24 పెన్ పవర్:** లోకేశ్వరం మండలం హర్గాం పంచాయతీ పరిధిలోని పొట్పెల్లి(ఎం) గ్రామంలో కదం లిఖిత (33) అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. అనారోగ్యం, కడుపునొప్పితో బాధపడుతున్న ఆమె కొన్నేళ్లుగా మందులు వాడుతున్నా ప్రయోజనం కనిపించలేదు. అన్నం తిని నిద్రపోయిన లిఖితను కుటుంబ సభ్యులు నిద్రలేపే ప్రయత్నం చేయగా స్పందించలేదు. తండ్రి పరిశీలించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

## రాజీనామాపై వెనక్కి తగ్గేది లేదు: జీవన్ రెడ్డి

**కరీంనగర్, మార్చి 24 పెన్ పవర్:** కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి తన రాజీనామా నిర్ణయంపై వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ చేసిన బుజ్జగింపులు విఫలమయ్యాయి. తాను ఏ డిమాండ్లను పీసీసీ ముందు పెట్టలేదని, తన సమస్యకు అధిష్ఠానం వద్ద పరిష్కారం లేదని తెలిపారు. పార్టీ మారొద్దని పీసీసీ చీఫ్ కోరారు కానీ ఎలాంటి హామీ ఇవ్వలేదని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల అనుబంధం వదులుకోవడం బాధగా ఉన్నా తప్పడం లేదని ఆయన అన్నారు.

## తల్లిదండ్రులు ఓ కన్నేయండి.!

**పెద్దపల్లి, మార్చి 24 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కటికెనపల్లిలో అభిరాం (6) కరెంట్ షాక్‌తో, కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నం హైవేపై లారీ ఢీకొని మూడేళ్ల బాలిక, జగిత్యాల జిల్లాలో కుక్క కాటుకు గురై మణితేజ (7) బాలుడు మృతి చెందారు. ఇటీవల కాలంలో పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తగ్గడంతో ఇలాంటి ప్రమాదాలు పెరుగుతున్నాయని వార్తలు వస్తున్నాయి. ఈ సంఘటనలు తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

## ఎలాంటి ఆందోళన వద్దు

**సిరిసిల్ల, మార్చి 24 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో వంట గ్యాస్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చి బాబు తెలిపారు. బుకింగ్ చేసిన తేదీల వారీగా, నిల్వల ఆధారంగా గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్లను డెలివరీ చేస్తాయని ఆయన పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 25 రోజుల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల్లోపు గ్యాస్ సిలిండర్లు అందుతాయని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

## బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు..

**రామగుండం, మార్చి 24 పెన్ పవర్:** బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో, మంగళవారం పోలీసులు బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, మండల యూత్ అధ్యక్షులు కొయ్య విక్రమ్, చొప్పరి వంశీలను ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఉప్పు రాజ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అక్రమ అరెస్టులను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలు, విద్యుత్ బస్సుల అంశంపై సీఐటీయూ ధర్నా

**మంథని, మార్చి 24 పెన్ పవర్:** విద్యుత్ బస్సులు ఆర్టీసీకే ఇవ్వాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గోదావరిఖని బస్ డిపో ముందు ధర్నా జరిగింది. ఈ ధర్నాకు ఐఎఫ్టియు మద్దతు తెలిపింది. ఈ నిరసనలో కార్మికుల హక్కులు, మెరుగైన పని పరిస్థితులపై దృష్టి సారించారు. ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం ప్రధాన అంశాలుగా ఈ నిరసన చేపట్టారు.

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26, 000 ఇవ్వాలి




**నల్లగొండ, మార్చి 24 పెన్ పవర్: :** మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ. 26,000 అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం పిలుపునిచ్చారు. మంగళవారం చలో హైదరాబాద్‌కు వెళ్తున్న మున్సిపల్ కార్మికుల వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. గత 30 ఏళ్లుగా పారిశుధ్య పనులు చేస్తూ పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికులకు చాలీచాలని వేతనాలు ఇస్తూ వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆయన ఆరోపించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రిటైర్మెంట్ హక్కులకు హైకోర్టు రక్షణ కవచం

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుల విషయంలో నెలకొన్న జాప్యం, నిర్లక్ష్యం, పరిపాలనా లోపాలపై రాష్ట్ర హైకోర్టు గట్టిగా స్పందించడం ఇటీవలి కాలంలో పరిపాలనా వ్యవస్థపై పెద్ద చర్చకు దారి తీసింది. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ జీవితాంతం ప్రభుత్వానికి సేవలందించిన తర్వాత, వారికి రావాల్సిన గ్రాట్యుటీ, పింఛన్, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి బకాయిలు నెలలు, కొన్ని సందర్భాల్లో సంవత్సరాలపాటు పెండింగ్‌లో ఉండడం ఒక తీవ్రమైన సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో, ఏప్రిల్ 9లోగా అన్ని రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం ప్రాధాన్యంగా మారింది. ఈ కేసు పూర్వాపరాలను పరిశీలిస్తే, రాష్ట్రంలోని పలు శాఖలకు చెందిన పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమకు రావాల్సిన బకాయిలు చెల్లించక పోవడంతో కోర్టును ఆశ్రయించడం ప్రధాన కారణంగా కనిపిస్తుంది. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, రెవెన్యూ, పోలీస్ శాఖల నుంచి రిటైర్ అయిన ఉద్యోగులు ఈ సమస్యను తీవ్రంగా ప్రస్తావించారు. కొందరికి 6 నెలలు, మరికొందరికి 1?2 సంవత్సరాలపాటు కూడా బకాయిలు అందకపోవడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వాదించారు. ఈ నేపథ్యంలో దాఖలైన పిటిషన్లను విచారించిన హైకోర్టు, ప్రభుత్వ వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేసింది. హైకోర్టు తన పరిశీలనలో ఒక కీలకమైన అంశాన్ని ప్రస్తావించింది. పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు, దయాధర్మం కాదు. పదవీ విరమణ పొందిన వెంటనే బకాయిలు చెల్లించడం ప్రభుత్వ బాధ్యతగా ఉండాలని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు గత తీర్పులను కూడా ఉటంకిస్తూ, పెన్షన్ చెల్లింపుల్లో జాప్యం రాజ్యాంగంలోని హక్కులను ఉల్లంఘించడమేనని పేర్కొంది. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్న ఉద్యోగులు తమ జీవితావసరాలకు ఈ నిధులపై ఆధారపడతారని, ఆలస్యం చేయడం వారి గౌరవాన్ని దెబ్బతీస్తుందని కోర్టు అభిప్రాయ పడింది. గణాంకాలను పరిశీలిస్తే, రాష్ట్రంలో ప్రతి ఏడాది సుమారు 60 వేల నుండి 80 వేల వరకు ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారు. వీరిలో కనీసం 30?40 శాతం మంది రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపులో ఆలస్యం ఎదుర్కొంటున్నట్లు అంచనా. ముఖ్యంగా ఆర్థిక సంక్షోభం, ఖజానా లోటు, ప్రాధాన్యతల మార్పు వంటి కారణాలతో ఈ చెల్లింపులు వాయిదా పడుతున్నాయి. ఒక అంచనా ప్రకారం, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్ మొత్తం విలువ వేల కోట్ల రూపాయలకు చేరుకుంటోంది. ఇందులో గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డిఎ బకాయిలు ముఖ్యమైనవి. హైకోర్టు ఈ అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, "ఉద్యోగి సేవలు తీసుకున్న తర్వాత, అతనికి రావాల్సిన న్యాయబద్ధమైన హక్కులను ఎందుకు నిలిపివేస్తున్నారు?" అని నిలదీసింది. ప్రభుత్వం తరఫున న్యాయవాదులు ఆర్థిక ఇబ్బందులను కారణంగా చూపించినప్పటికీ, కోర్టు దానిని సరైన సమాధానంగా అంగీకరించలేదు. ప్రజల సేవల కోసం పని చేసిన ఉద్యోగులకు న్యాయం చేయడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతగా ఉండాలని పేర్కొంది. అంతేకాకుండా, ఈ చెల్లింపులను ఏప్రిల్ 9లోగా పూర్తి చేయాలని స్పష్టమైన గడువు విధించడం ద్వారా పరిపాలనా యంత్రాంగంపై ఒత్తిడి పెంచింది. ఈ ఆదేశాల ప్రభావం పరిపాలనా వ్యవస్థపై గణనీయంగా పడే అవకాశం ఉంది. మొదటిగా, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన క్లియర్ చేయాల్సిన అవసరం ఉంటుంది. రెండవది, భవిష్యత్తులో ఇలాంటి జాప్యాలు జరగకుండా ఆర్థిక ప్రణాళికను మెరుగుపరచాల్సి ఉంటుంది. మూడవది, డిజిటల్ పద్ధతుల్లో పింఛన్ ప్రాసెసింగ్‌ను వేగవంతం చేయడం, బాధ్యతలను స్పష్టంగా నిర్వచించడం అవసరం అవుతుంది. ఇక ఉద్యోగుల కోణంలో చూస్తే, ఈ తీర్పు వారికి ఒక నైతిక బలం ఇచ్చింది. కోర్టు జోక్యం వల్ల తమ సమస్యలు పరిష్కారం దిశగా వెళ్లే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు. ఉద్యోగ సంఘాలు కూడా ఈ తీర్పును స్వాగతిస్తూ, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. కొన్ని సంఘాలు ఇప్పటికే పెండింగ్ బకాయిలపై వడ్డీ చెల్లించాలని కూడా కోరుతున్నాయి. అయితే, ప్రభుత్వానికి ఇది ఒక ఆర్థిక సవాలు కూడా. పెద్ద మొత్తంలో నిధులు తక్షణం సమీకరించడం, ఇతర అభివృద్ధి పనులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయినప్పటికీ, హైకోర్టు ఆదేశాలు చట్టబద్ధంగా అమలు చేయాల్సిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బడ్జెట్ పునర్వ్యవస్థీకరణ, అప్పుల సమీకరణ, ఖర్చుల నియంత్రణ వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఇది కేవలం ఒక చట్టపరమైన అంశం మాత్రమే కాదు, పరిపాలనా నైతికతకు సంబంధించిన విషయం కూడా. ఉద్యోగుల సేవలను గౌరవించడం, వారికి సమయానికి హక్కులను అందించడం మంచి పాలనకు సూచిక. ఈ సంఘటన ప్రభుత్వానికి ఒక హెచ్చరికగా, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. మొత్తం మీద, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపులపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ఒక మైలురాయిగా చెప్పుకోవచ్చు. ఇది ఉద్యోగుల హక్కులను రక్షించడమే కాకుండా, పరిపాలనా వ్యవస్థలో బాధ్యతను పెంపొందించే దిశగా ఒక కీలకమైన అడుగు. ప్రభుత్వం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణతో పాటు పారదర్శక విధానాలను అమలు చేస్తే, భవిష్యత్తులో ఇలాంటి వివాదాలు తగ్గే అవకాశం ఉంది.

# ఉగ్రవాదులకు అడ్డాగా పాక్

**హైదరాబాద్ పెన్ పవర్:** 'ఇనిస్టిట్యూట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్ (ఐఈపీ)" అనబడే స్వచ్ఛంద సంస్థ ప్రపంచవ్యాప్తంగా కోరలు చాస్తున్న ఉగ్రవాద ప్రతికూల ప్రభావాలను నివేదిక రూపంలో విడుదల చేయడం జరిగిందిది. ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న 99.7 శాతం జనాభాను కవర్ చేస్తూ 163 దేశాల్లో ఉగ్రవాద ప్రభావాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదికను "గ్లోబల్ టెర్రరిజమ్ ఇండెక్స్-2026 (జిటీఐ)" రూపంలో విడుదల చేయడం జరిగింది. ప్రపంచ దేశాల్లో ఉగ్రవాద చర్యలను పరిగణనలోకి తీసుకొని ఒక శాస్త్రీయ పద్దతి ప్రకారం ప్రతి దేశానికి 0 నుంచి 10 వరకు ఉన్న స్కేల్‌పై స్కోర్లు ఇవ్వడం జరుగుతోంది. ఇందులో '0' జిటీఐ స్కోర్ పొందిన దేశంలో ఉగ్రవాదం ప్రభావం లేదని, జిటీఐ 10 ఉంటే అత్యధిక ఉగ్రవాద ప్రభావం ఉందని సూచిస్తుంది. గతంతో పోల్చితే 28 శాతం మరణాలు, 22 శాతం ఉగ్ర ఘటనలు తగ్గడం ఓ ఉపశమన పరిశీలనగా పరిగణించాలి. 2007 తర్వాత తక్కువ ఉగ్ర ఘటనలు, మరణాలు 2025లో గమనించడం కొంత ఊరటను ఇస్తున్నది. గ్లోబల్ టెర్రరిజమ్ ఇండెక్స్-2026 నివేదికలో ఉగ్రవాద ప్రభావంతో మరణాలు, ఆస్తి నష్టాలు, ఘటనల సంఖ్య లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. 2026 జిటీఐ నివేదికలో 28 శాతం వరకు ఉగ్రవాద కారణ మరణాలు (5,582), 22 శాతం ఘటనలు (2,944) తగ్గాయని తగ్గాయని స్పష్టం చేశారు. 2025లో పాకిస్థాన్‌లో మాత్రమే 1,045 ఉగ్ర ఘటనల్లో 1,139 ఉగ్రవాద మరణాలు, 1,595 గాయపడిన వారు, 655 మంది హోస్టేజెస్‌గా నమోదు అయ్యాయి. అత్యధిక ఉగ్రవాదం నమోదు చేసుకున్న 10 దేశాల్లో ఆరు సహారా ఉప-ప్రాంత ఆఫ్రికాలో ఉండడం గమనార్హం. తొలిసారిగా, గ్లోబల్ టెర్రరిజమ్ ఇండెక్స్-2026 జాబితాలో అగ్ర స్థానంలో పాకిస్థాన్ నిలవడం విశేషం. మొత్తం 163 దేశాలకు చెందిన గ్లోబల్ టెర్రరిజమ్ ఇండెక్స్-2026 జాబితాలో ఉన్న 10 అగ్ర దేశాల్లో పాకిస్థాన్ (8.574), బుర్కినా ఫాసో (8.324), నైగర్ (7.816), నైజీరియా (7.792), మాలి (7.586), సిరియా (7.545), సొమాలియా (7.391), డెమక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (7.171), కొలంబియా (7.116), ఇజ్రాయిల్ (6.790) అనే దేశాలు ఉన్నాయి. ఈ జాబితాలో 13వ స్థానంలో 5.822 స్కోర్‌తో భారత్ ఉన్నది. ఈ జాబితాలో ఇరాన్(18), అమెరికా(28), ఆస్ట్రేలియా (3.732), ఫ్రాన్స్ (35), యూకె (38), న్యూజిలాండ్ (95) దేశాలు ఉన్నాయి. ఉగ్రవాద కార్యకలాపాలు లేని (జీరో జిటీఐ స్కోర్) దేశాలుగా భూటాన్, క్యూబా, మడగాస్కర్, పనామా లాంటి దాదాపు 64 దేశాలు ఉన్నాయి. 2025లో కేవలం భారత్‌లో 142 ఉగ్ర ఘటనలు, 100 వరకు మరణాలు, 118 గాయపడిన వారు ఉన్నారు. తీవ్రవాది నానాటికి పెరగడం, మొత్తం ఉగ్రవాద మరణాల్లో 87 శాతం వరకు

పది దేశాల్లోనే నమోదు కావడం విచారకరం. అత్యంత ప్రమాదకర ఉగ్రవాద సంస్థల్లో ఇస్లామిక్ స్టేట్, తెహ్రిక్-ఎ-తాలిబన్, జమాత్ నుస్రత్ అల్-ఇస్లామ్ ఉల్ ముస్లిమీన్, అల్-షబాబ్ లాంటి ఇస్లామిక్ ఉగ్రవాద గ్రూపులు ఉన్నాయి. ఇప్పటికైనా ఇస్లామిక్ ఉగ్రవాద గ్రూపులు బుద్ధి తెచ్చుకొని, హింసతో మరణాలు తప్ప ఏదీ సాధ్యం కాదని, శాంతి మార్గమే శరణ్యం అని భావించి చర్చల ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని, ప్రపంచ శాంతికి ఊతం ఇవ్వాలని ప్రపంచ మానవాళి కోరుకుంటున్నది.

# భ్రూణహత్యలు మానవత్వానికి మచ్చ

**హైదరాబాద్ పెన్ పవర్:** పుట్టిన బిడ్డతో పోల్చితే తల్లి గర్భంలో పురుడు పోసుకున్న బిడ్డకు సమాన హక్కులు ఉండవు. తల్లితండ్రుల ఇష్టాయిష్టాలు బట్టి గర్భంలో దాగిన శిశువు జీవితం ఆధారపడి వుంటుంది. మూడు, నాలుగు నెలల గర్భవతి పలు కారణాలతో అబార్షన్ చేయించుకోవడం చూస్తున్నాం. తల్లి గర్భంలో మొలిచిన 3 లేదా 4 మాసాల చిరు ప్రాణం అమ్మాయిని తెలిసి తల్లితండ్రులు బలవంతంగా అబార్షన్ చేయించుకోవడం అనే అమానవీయ సంఘటనలను మనం నిత్యం చూస్తున్నాం. పోప్ జాన్ పాల్-2 ఆలోచనల పర్యవసానంగా 1999 నుంచి ప్రతి ఏట 25 మార్చి రోజున "అంతర్జాతీయ పుట్టబోయే బిడ్డ దినం లేదా ఇంటర్నేషనల్ అన్‌బార్న్ చైల్డ్"ను పాటించుట ఆనవాయితీగా మారింది. తల్లి గర్భంలో కోటి ఆశలతో జన్మించనున్న బిడ్డను తొలి మొగ్గ దశలోనే శిశువును బలవంతంగా అబార్షన్ పేరుతో చంపి వేయడం అమానుషం, ఘోర పాపం. క్రీస్తు జన్మించిన 25 డిసెంబర్ కన్న 9 నెలల ముందు 25 మార్చిన ఈ వేడుకలను నిర్వహించడం సముచితంగా ఉన్నది. తల్లి గర్భంలో ఉన్న 3-4 మాసాల పసి గుడ్డును పలు కారణాలతో ఆదిలోనే అబార్షన్ రూపంలో తుంచి వేయడం అనే దుర్మార్గ ఆచారం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి 25 మార్చిన ఈ వేదిక ఉపయోగపడుతున్నది. పిల్లలు ఇప్పుడే వద్దని, ఆర్థిక ఇబ్బందులు వస్తాయని, తల్లి ఆరోగ్యం బాగాలేదని, పలు లోపాలున్న శిశువు జన్మించవచ్చని, ఆడ బిడ్డ అని తెలుసుకొని, సామాజిక ఆర్థిక సమస్యలు, మహిళలపై గృహ హింసలు, ఆడ వారికి స్వేచ్ఛ లేకపోవడం, మగ పిల్లాడిపై ప్రేమ, కుటుంబ నియంత్రణతో చిన్న కుటుంబాల భావనలు పెరగడం లాంటి పలు కారణాలతో తల్లులు అబార్షన్ చేయించుకోవడం చూస్తున్నాం. వీటిలో ఆడ బిడ్డ గర్భంలో ఉందని తెలిసి, అమ్మాయి రేపటి బరువు అని తలచి, వరకట్నం ఇవ్వవలసి ఉంటుందని తెలిసి తల్లిదండ్రులు అబార్షన్ వరకు వెళ్లడం సోచనీయం. భారత్‌లో సాలీనా దాదాపు 15.6 మిలియన్ల అబార్షన్లు జరుగుతున్నాయని, ప్రతి వెయ్యి మంది తల్లుల్లో 48 మంది అబార్షన్ చేయించుకుంటున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వీటిలో దాదాపు 75 శాతం ఆడ శిశువు అని తెలిసి జరుగుతున్నట్లు అర్థం అవుతున్నది. 2000-2019 మధ్య కాలంలో భారత్‌లో కనీసం 9 మిలియన్ల ఆడ శిశువు అబార్షన్లు జరిగినట్లు తెలుస్తున్నది. సాధారణంగా సహజ ప్రకృతి నియమాల ప్రకారం ప్రతి 100 మంది ఆడ శిశువులకు 103-107 వరకు మగ శిశువులు జన్మించడం గమనించారు. భారత్‌లో లైంగిక నిష్పత్తి మహారాష్ట్రలో 100 మంది ఆడ శిశువులకు 118 మగ శిశువులు, హర్యానాలో 120, జె అండ్ కెలో 116 మంది మగ శిశువులు జన్మించడం జరిగింది.

ఆడ శిశువును గర్భంలోనే చంపేస్తున్నారని తెలుసుకున్న భారత ప్రభుత్వం ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలను నిషేధించినప్పటికీ వైద్యుల నీచ బుద్ధులు, తల్లితండ్రుల అనాలోచిత నిర్ణయాలతో ఆడ బిడ్డలు పుట్టక ముందే తల్లి గర్భంలో చనిపోవడం బాధాకరం. అలాంటి అమానవీయ ఆలోచనలకు స్వస్తి పలికి ఆడ బిడ్డని శిశువుతో సమానంగా కనడం, పెంచడం చేసిన యెడల లిమగ సమానత్వం సాధించడం సులభం అవుతుంది. అలాంటి లింగ ఆధారిత అబార్షన్ వ్యవస్థలను అదుపు చేసి ఇద్దరూ సమానమే అనబడే దివ్య భావనలకు పట్టం కడదాం, అష్టలక్ష్ముల దీవెనలతో ఆడ బిడ్డలను అపురూపంగా చూసుకుందాం, భ్రూణ హత్యలను బొంద పెడదాం.

# జ్ఞాపకంగా కృష్ణా ప్యాలెస్‘

**విజయవాడ, మార్చి 24, పెన్ పవర్:** కృష్ణా నదిపై బ్రిటిషర్ల హయాంలో నిర్మించిన బ్రిడ్జి చరిత్రలో జ్ఞాపకంగా మిగలబోతోంది. 130 ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జి పిల్లర్ల కూల్చివేతలు మొదలు పెట్టారు. కొత్త డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు ఈ పాత బ్రిడ్జి పిల్లర్లను కూల్చివేయబోతున్నారు. హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో కూల్చివేతలు సాధ్యం కాకపోవడంతో.. అధికారులు లిమిటెడ్ బ్లాస్టింగ్ విధానంలో కూల్చేందుకు సిద్ధమవుతున్నారు. 130 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన బ్రిటీష్ కాలం నాటి రైల్వే బ్రిడ్జి కనమరుగు కాబోతోంది. 1893లో ప్రారంభించిన ఈ బ్రిడ్జి స్థానంలో కొత్తగా డబుల్ లైన్ బ్రిడ్జిని నిర్మించడం కోసం రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. గతంలోనే ఈ బ్రిడ్జిపై ఉన్న నిర్మాణాన్ని కూల్చివేయగా.. ప్రస్తుతం ఈ బ్రిడ్జికి సంబంధించి మిగిలిన పిల్లర్లను తొలగించే పనులు చేపట్టారు. రెండు వారాలకు పైగా హైడ్రాలిక్ క్రేన్ల సహాయంతో పిల్లర్లను పగలగొట్టాలని ప్రయత్నించారు.. కానీ వీలు పడలేదు. అందుకే ఈ పిల్లర్లను కూల్చివేసేందుకు లిమిటెడ్ బ్లాస్టింగ్ పద్ధతిలో కూల్చివేతలు ప్రారంభించనున్నారు. ఈ విధానంలో ఒక్కో పిల్లర్‌ను తొలగించకుంటూ పోతారు. దీనికి చాలా సమయం పడుతుందని చెబుతున్నారు. 1856 ప్రాంతంలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎంఎస్ఎం (మద్రాస్ టు సదరన్ మరాఠా) రైల్వేలో విజయవాడ ఓ భాగంగా ఉండేది. 1893లో కృష్ణానదిపై మూడు కిలోమీటర్ల పొడవున మీటర్ గేజ్ విధానంలో ఈ రైల్వే బ్రిడ్జిని ప్రారంభించారు. వంతెన ప్రవేశ మార్గంలో కోట బురుజులను తలపించే రెండు నిర్మాణాలు ఉండటం, అవి చూసేందుకు ప్యాలెస్‌ను తలపించడంతో.. ఈ బ్రిడ్జికి కృష్ణా ప్యాలెస్‌గా పేరు పెట్టారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి స్టీల్ వాడకుండా రాతి బండలు, గానుగ సున్నం సాయంతోనే అత్యంత పటిష్టంగా నిర్మించారు. అందుకే ఇన్నేళ్లు గడిచినా పిల్లర్లను కూల్చడానికి శ్రమించాల్సి వస్తోంది. 1897లో ఈ రైల్వే బ్రిడ్జిని బ్రాడ్ గేజ్‌గా అప్‌గ్రేడ్ చేశారు. అనంతరం రైల్వేశాఖ ఈ బ్రిడ్జికి తూర్పు, పశ్చిమ వైపున రైల్వే బ్రిడ్జిలు నిర్మాణం చేసింది. 1985 వరకు ఈ వంతెన సేవలు అందించింది. 1993లో అధికారికంగా ఈ వంతెనపై రాకపోకలు నిలిపేశారు. ఆ తర్వాత కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జి వయాడక్ట్‌ను తొలగించగా.. అప్పటి నుంచి ఈ పిల్లర్లు మాత్రమే ఉండిపోయాయి. అయితే ప్రస్తుతం విజయవాడ, గూడూరు మధ్య మూడో రైల్వే లైన్ నిర్మాణం చేపట్టడంతో.. డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి నిర్మించాలని ప్లాన్ చేశారు. అందుకే ప్రస్తుతం చారిత్రక కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జికి సంబంధించి మిగిలిన పిల్లర్లను కూడా తొలగించాలని నిర్ణయించారు. 130 ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న బ్రిడ్జికి సంబంధించిన పిల్లర్లను తొలగించొద్దని కోరుతూ గతంలో కొందరు రైల్వే అధికారులకు లేఖలు రాశారు. దీంతో ఈ బ్రిడ్జి జోలికి వెళ్లలేదు.. కానీ ఇప్పుడు డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి కోసం కృష్ణా ప్యాలెస్ వంతెన పిల్లర్లను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ ఈ వంతెన పిల్లర్లను అలాగే వదిలేసి కొంత దూరంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలన్నా అనుమతుల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అందుకే ఈ పాత బ్రిడ్జిని తొలగించి..

కొత్త బ్రిడ్జిని నిర్మించాలని ప్లాన్ చేశారు. ముందుగా పిల్లర్లను తొలగించే ప్రక్రియను మొదలు పెట్టారు. కానీ వంతెన పిల్లర్లు ఇప్పటికీ పటిష్టంగా ఉండటంతో.. హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో వాటిని తొలగించడం సాధ్యం కాలేదు. అందుకే లిమిటెడ్ బ్లాస్టింగ్ విధానంలో ఈ పిల్లర్లను కూల్చే పనులు ప్రారంభించనున్నారు. ఈ విధానంలో తక్కువ మోతాదులో పేలుడు పదార్థాలను ఉపయోగించి, పిల్లర్లకు పగుళ్లు వచ్చేలా చేస్తారు. ఆ తర్వాత హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో తొలగిస్తారు. దీంతో విజయవాడ చరిత్రలో ‘కృష్ణా ప్యాలెస్‘ వంతెన జ్ఞాపకంగా మిగలబోతోంది

# కొండెక్కిన కోడి



**నెల్లూరు, మార్చి 24 పెన్ పవర్:** మాంసం ప్రియులకు షాకింగ్ న్యూస్. ఎందుకంటే చికెన్ ధరలు భారీగా పెరిగాయి. గత కొన్ని రోజులుగా పెరుగుతూ వస్తున్న చికెన్ ధరలు.. తాజాగా భారీ స్థాయిలో ఎగబాకుతోంది. ధరలు కొండెక్కుతున్నాయి. ఆదివారం బహిరంగ మార్కెట్‌లో కిలో చికెన్ (స్కిన్‌లెస్) ధర రూ. 340 వరకు ఉండగా, అదే వారం రోజుల కిందట కిలో చికెన్ ధర రూ. 260 వరకు ఉంది. చికెన్ ధరలు ఒక్కసారి పెరగడంతో సామాన్యులు కష్టంగా మారిపోయింది. ముందే యుద్ధం కారణంగా ఒక్కొక్కటిగా ధరలు పెరిగిపోతుండటంతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు చికెన్ ధరలు పెరగడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇదిలా ఉంటే మరోవైపు కోడి గుడ్డు ధర మాత్రం పడిపోతున్నాయి. గతంలో ఒక గుడ్డు ధర రూ. 8 వరకు ఉండగా.. ఇప్పుడు రూ. 4..20 పైసల వద్ద కొనసగుతోంది. కోడిగుడ్లు ఎగుమతి ఆగిపోవడంతో ధరలు పడిపోయాయని పౌల్ట్రీ యజమానులు చెబుతున్నారు. అయితే వాస్తవానికి కోడిగుడ్లు తమిళనాడుకు తీసుకెళ్లి అక్కడి నుంచి గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతాయి. కానీ ప్రస్తుతం యుద్ధం కారణంగా గల్ఫ్‌కు ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో గుడ్డు ధర అమాంతంగా పడిపోయింది. చికెన్ ధర పెరగడానికి బ్రాయిలర్ కోళ్ల ఉత్పాదకత తగ్గడం, రంజాన్, ఇతర ఫంక్షన్ల కారణంగా చికెన్ ధరలు పెరగడానికి కారణమని చెబుతున్నారు చికెన్ దుకాణ వ్యాపారులు. డిమాండ్‌కు సరిపడా చిన్న బ్రాయిలర్ కోళ్లు కూడా దొరకడం లేదట. అలాగే పౌల్ట్రీ నిర్వాహకులు పిల్లల పెంపకం ఆపేదయం కూడా మరో కారణం అంటున్నారు. కోళ్లు డిమాండ్‌కు తగిన విధంగా సరఫరా లేని కారణంగా చికెన్ ధరలు భారీగా పెరుగుతున్నాయని చెబుతున్నారు.

# కాసులు కురిపిస్తున్న ఎర్ర బంగారం

**గుంటూరు, మార్చి 24 పెన్ పవర్:** తెలుగు రాష్ట్రాల్లో పండించే మిరప పంటకు ప్రపంచ స్థాయిలో గిరాకీ ఎక్కువే. నాణ్యతతోపాటు మంచి రంగు, రుచి, ఘాటు వీటికి ఉంటుంది. అయితే మిరప రైతులకు గిట్టుబాటు ధర దొరక్క యేటా అప్పుల ఊబిలో కూరుకుపోయి నష్టాలు చూసేవారు. దీంతో నష్టాల బాధలు భరించలేక చాలా మంది రైతులు మిరపను సాగుచేయలేమంటూ చేతులెత్తేశారు. ఇక మరికొంతమంది రైతులు చేస్తున్న సాగు విస్తీర్ణంను తగ్గించుని కొద్ది మొత్తంలో మాత్రమే మిరప పంటను పండిస్తున్నారు. అయితే ఈ ఏడాది మాత్రం మిరప పంట రైతులకు కనీవినని రీతిలో కాసులు కురిపించనున్నాయి. అందుకు కారణం మార్కెట్లో మన ఎర్రబంగారానికి ధరలు ఆశాజనకంగా ఉండటమే. ముఖ్యంగా ఏపీలో జనవరి నుంచి మిర్చి ధరల్లో క్రమ క్రమంగా పెరుగుదల కనిపించింది. క్వింటాలుకు సగటున రూ. 20 వేల వరకు ధర లభిస్తోంది. జనవరి నుంచి ఇప్పటి వరకు సగటున క్వింటాలుకు రూ. 5 వేలకు పైగానే ధర పెరిగింది. మిర్చికి డిమాండ్ పెరగడంతో వ్యాపారులు నేరుగా గ్రామాలకు చేరుకుని మధ్యవర్తుల జోక్యం లేకుండానే రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు చేస్తున్నారు. దీంతో గత నాలుగైదేళ్లుగా నష్టాలను చూసిన మిర్చి రైతులకు తాజా ధరలు ఉపశమనం అందించాయి. మార్కెట్లో మంచి ధర పలకడంతో ప్రస్తుతం శీతల గోదాముల్లో నిల్వ చేసిన సరకు కొద్ది కొద్దిగా తగ్గడం మొదలైంది. ఇక గుంటూరు మార్కెట్ యార్డుకు గత వారంలో 1.29 లక్షల బస్తాల మిరప రాగా.. ఇందులో ఏకంగా 1.26 లక్షల బస్తాల వరకు అమ్ముడయ్యాయి. అయితే మిర్చి సాగు ఈసారి ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కాదు.. కర్ణాటక, తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సైతం తగ్గింది. ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్ పెరిగినట్లైంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉండటంతో జనవరి నెల నుంచే ధరల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. గతేడాది క్వింటాల్ మిర్చీ కేవలం రూ. 10 వేలలోపు మాత్రమే పలికింది. ఈ సారి రూ. 20 వేలకు పైగానే ధర పలుకుతోంది. తేజ మిర్చి ధర జనవరి, ఫిబ్రవరిలో రూ. 15 వేలు ఉంటే ప్రస్తుతం ఏకంగా రూ. 19,500కు చేరుకుంది. తాలు రకం కూడా క్వింటాలు ధర రూ. 10 వేలకు పైగానే పలుకుతుంది. ఇలా జనవరి నెల నుంచే అన్ని రకాల మిర్చీకి ధరల్లో ఘననీయమైన పెరుగుదల కనిపించింది. పంటలు 50 శాతం తగ్గడం, గోదాముల్లో మిర్చీ నిల్వలు తక్కువగా ఉండటంతో వ్యాపారులు పోటీపడి మరీ పంటను కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లో ధరలు ఊపందుకోవడంతో రైతులు మిర్చి పంట కోతలు కోసిన వెంటనే త్వరితగతిన ఆరబెట్టి మార్కెట్‌కు తరలిస్తున్నారు. అన్ని ఖర్చులూ కలుపుకుని ఎకరాకు రూ. 4 లక్షల వరకు పంట ఉత్పత్తి వ్యయం అవుతోంది. ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే సగటున క్వింటాలుకు రూ. 18 వేలు వేసిన పాతిక క్వింటాళ్లకు రూ. 4.50 లక్షల వరకు చేతికొచ్చే అవకాశం ఉంది.

**రైతులకు ఆనందం**

వరుసగా నష్టాలు రావడంతో ఇక సాగు చేయడం తమ వల్ల కాదంటూ కొందరు మిరప సాగు చేయలేదు. ఇది కాస్త కలిసి వచ్చింది. జనవరి ప్రారంభం వరకు నామమాత్రం ధరలు ఉన్నా.. కొత్త సంవత్సరం నుంచి మిరప ధరలు పైపైకి చేరాయి. ప్రస్తుతం క్వింటాల్ మిరపకు సగటున రూ. 20 వేల ధర పలుకుతోంది. జనవరికి నేటికి ధరను పోలిస్తే.. సుమారు 5 వేల రూపాయల వరకు పెరిగింది. ప్రస్తుతం మిరపకు డిమాండ్ బాగా ఉండటంతో.. వ్యాపారులు గ్రామాలకు వెళ్లి నేరుగా రైతుల వద్ద నుంచి మిరప కొనుగోలు చేస్తున్నారు. తాజా పరిణామంతో గత ఐదేళ్లుగా మిరప సాగుతో నష్టాలు చవి చూసిన రైతులు ఈసారి లాభాలను కళ్ల చూస్తున్నారు. మిర్చికి ప్రస్తుతం ఎంత డిమాండ్ ఉందంటే.. గత మంగళవారం గుంటూరు మార్కెట్ యార్డుకు 1.29 లక్షల బస్తాల మిర్చి రాగా, 1.26 లక్షల బస్తాలు అమ్ముడుపోయాయి. దీన్ని బట్టి మిర్చికి డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా మిరప సాగు తగ్గిపోయింది. అటు అంతర్జాతీయ మార్కెట్ లో మిర్చికి మంచి డిమాండ్ ఉండటంతో.. ఈ సంవత్సరం జనవరి నుంచి మిర్చి ధర క్రమంగా పెరుగుతూ వస్తోంది. గతేడాది ఇదే సమయానికి రూ. 10 వేలకు అమ్ముడుపోయిన మిర్చికి ఇప్పుడు రూ. 20 వేల ధర పలుకుతోంది. సన్న రకాలకు డిమాండ్ బాగా పెరిగింది. దీంతో ఈ సంవత్సరం జనవరి, ఫిబ్రవరిలో రూ. 15 వేలు ఉన్న తేజ మిర్చి క్వింటాల్ ధర ప్రస్తుతం రూ. 19,500కు చేరింది. తాలు ధరలు క్వింటాలుకు రూ. 10 వేలకు పైనే ఉన్నాయి. ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు మిరప కోసిన వెంటనే ఆరబెట్టి అమ్మేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ సంవత్సరం మిరప సాగుకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. అన్ని ఖర్చులూ కలిపి ఎకరాకు రూ. 4 లక్షల వరకు ఖర్చు అవుతుందంటున్నారు అన్నదాతలు. ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే.. సగటున క్వింటాలుకు రూ. 18 వేల ధర లభిస్తే.. అప్పుడు రూ. 4.50 లక్షల వరకు చేతికొస్తోందని తెలిపారు.

# మళ్లీ రంగంలోకి ప్రశాంత్ కిషోర్

**గుంటూరు, మార్చి 24 పెన్ పవర్:** 2019 ఎన్నికల్లో వైసీపీ సాధించిన ప్రభంజన విజయంలో ప్రశాంత్ కిశోర్ వ్యూహాలు ఎలా సక్సెస్ అయ్యాయో రాష్ట్రంలో అందరికీ తెలిసిందే. అయితే ‘రావాలి జగన్ – కావాలి జగన్‘ నినాదం అప్పట్లో ఏపీని ఊపేసింది. ఊరూరా వైసీపీ జెండా రెపరెపలాడింది. అయితే 2024 ఎన్నికల సమయంలో మాత్రం వైసీపీ చతికిలపడింది. ఇందుకు పీకే దూరమవ్వడమే కారణం. కేవలం ఐప్యాక్ టీమ్‌తోనే జగన్ ఎన్నికలకు వెళ్లడంతో అత్యంత దారుణమైన పరాభవాన్ని మూటగట్టుకున్నారు. జగన్ 175 అంచనాలన్నీ తలకిందులయ్యాయి. ఘోర పరాజయాన్ని చవిచూశారు. అయితే ఇప్పుడు పార్టీని మళ్ళీ గాడిలో పెట్టేందుకు జగన్ ప్రయత్నం చేస్తున్నారు. తన పాత మిత్రుడు పీకే వైపు చూస్తున్నట్లు పొలిటికల్స్ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది. కాగా 2024 ఎన్నికల ఫలితాలకు ముందు ప్రశాంత్ కిషోర్ చేసిన కొన్ని వ్యాఖ్యలు అప్పట్లో ఏపీ రాజకీయాల్లో తీవ్ర దుమారాన్ని రేపాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమి తప్పదని కుండబద్దలు కొట్టారు. అంతేకాదు ఆ అంచనాలే నిజం అయ్యాయి.

దీంతో వైసీపీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది. ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలతో జగన్ ప్రజల్లోకి వెళ్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడంలేదని ఆయన భావిస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పీకే వంటి బలమైన వ్యూహకర్త మళ్లీ అవసరమని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు 2029 లక్ష్యాన్ని ఛేదించేందుకు మూడేళ్ల ముందే నుంచి వ్యూహాలు సిద్ధం చేస్తున్నారని, ఇందులో భాగంగానే పీకేతో జగన్ సంప్రదింపులు చేస్తున్నారనే ప్రచారం రాష్ట్రంలో జోరుగా జరుగుతోంది. ప్రస్తుతం ప్రశాంత్ కిశోర్ బీహార్‌లో జన్ సూరాజ్ పార్టీ పెట్టి ఆ ప్రయాణంలో బిజీగా ఉన్నారు. గతంలో ఆయన ‘నేను వ్యూహకర్త బాధ్యతల నుంచి తప్పుకున్నాను‘ అని ప్రకటించారు. కానీ జగన్‌తో ఉన్న పాత పరిచయం కారణంగా వీరి కలయిక మళ్లీ సాధ్యమేననే విశ్లేషణలు జరుగుతున్నాయి. ఐప్యాక్ టీమ్ క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పని చేస్తే మళ్లీ విజయవంతమైన ఫలితాలు ఉంటాయని, అటు క్యాడర్‌లోనూ కొత్త ఉత్సాహం వస్తుందని వైసీపీ అగ్రనేతలు భావిస్తున్నారని తెలుస్తోంది. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరనే సామెత ఉండనే ఉంది. ఈ ప్రకారం జగన్, పీకే మళ్ళీ చేతులు కలిపితే రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు జరగుతాయి. 2024 ఓటమి నుంచి పాఠాలు నేర్చుకున్న జగన్.. మళ్లీ పీకే సలహాలు తీసుకుని సరికొత్త ‘జగన్ 2.0‘ వ్యూహాన్ని ఎలా అమలు చేస్తారో చూడాలి.

# రాజ్యసభకు యనమల, సానా

**కాకినాడ, మార్చి 24 పెన్ పవర్:** కూటమిలో రాజ్యసభ రేసు ఆసక్తికరంగా మారింది. త్వరలో ఏపీలో నాలుగు రాజ్యసభ సీట్లు ఖాళీ కాబోతున్నాయి. దీంతో పెద్దల సభ రేసులో..తెలుగు తమ్ముళ్లు పెద్ద క్యూ కట్టారు. పైరవీల పర్వం నెక్స్ట్ లెవల్‌కు చేరుకుంది. నాలుగు స్థానాల సీట్లలో టీడీపీకి రెండు, జనసేన, బీజేపీకి చెరో సీటు దక్కే అవకాశం ఉంది. టీడీపీకి దక్కే రెండింటిలో గతేడాది ఎన్నికైన సానా సతీష్ ఏడాదిన్నరలోనే పదవీ విరమణ చేస్తుండటంతో ఆయనకు మళ్లీ రెన్యూవల్ చేస్తారని పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతో టీడీపీకి కొత్తగా దక్కేది ఒక్క సీటేనన్న అంచనాలు ఉన్నాయి. ఆ ఒక్క సీటు కోసం టీడీ జనార్ధన్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆయన సీఎం చంద్రబాబు రాజకీయ కార్యదర్శిగా ఉన్నారు. టీడీపీ మాజీ పొలిట్ బ్యూరో మెంబర్, గతంలో ఎమ్మెల్సీ. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో టీడీ జనార్ధన్‌ను రాజ్యసభకు పంపితే..ఢిల్లీ పనులన్నీ చక్కబెడతారని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే టైమ్‌లో మరో సీనియర్ లీడర్ యనమల రామకృష్ణుడు రాజ్యసభ బెర్త్ కోసం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తెలుగుదేశం పార్టీ పుట్టిన దగ్గర నుంచి యనమల రామక్రిష్ణుడు పార్టీలో ఉన్నారు. 1983లోనే ఆయన ఎమ్మెల్యేగా గెలిచి..ఎన్టీఆర్ మంత్రి వర్గంలోనే కీలక మంత్రి పదవులు నిర్వహించారు. ఇక చంద్రబాబు హయాంలో స్పీకర్‌గానే కాకుండా ఆర్థిక మంత్రిగా సుదీర్ఘ కాలం పనిచేస్తూ ఎన్నో బడ్జెట్లను ప్రవేశపెట్టారు. పన్నెండేళ్ల పాటు ఎమ్మెల్సీగా ఉన్నారు. అయితే యనమల చిరకాల కోరిక రాజ్యసభకు వెళ్లాలని. దశాబ్ద కాలంగా ఆయన పెద్దల సభకు వెళ్లాలని ఆశపడుతున్నారు. కానీ ఇప్పటివరకు అవకాశం లేదు. ఇప్పుడా ఆ ముహూర్తం దగ్గర పడిందా అంటే అవుననే ప్రచారం జరుగుతోంది. అయితే సానా సతీష్‌కు రెన్యూవల్ చేయగా..మిగిలిన సీటును సీనియర్లలో ఎవరికో ఒకరికి ఇవ్వాలని చంద్రబాబు ఫిక్స్ అయినట్లు టాక్. పైగా ఆ సీటు బీసీలకు ఇస్తారని అంటున్నారు. ఈ రెండు ఈక్వేషన్స్ బట్టి చూస్తే యనమల స్వీట్ న్యూస్ పక్కా అన్న మాట బలంగా వినిపిస్తోంది. గతేడాది మార్చిలోనే ఆయన ఎమ్మెల్సీ పదవి గడువు ముగిసింది. దీంతో పెద్దాయనకు సముచితమైన గౌరవం దక్కాలంటే కచ్చితంగా రాజ్యసభకు పంపడమే బెటర్ అని పార్టీ పెద్దలు భావిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. యనమల చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు. ఆంతరంగికుడిగా మెలుగుతారు కూడా. ఇద్దరూ సమ వయస్కులు. ఇద్దరూ రాజకీయంగా కలసి మెలసి ఉంటూ టీడీపీలో కీలక దశకు చేరుకున్న వారు. దాంతో చంద్రబాబు తన మిత్రులకు..పైగా సీనియర్లకు గౌరవనీయమైన స్థానం కల్పించే యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. గతేడాది సీనియర్ లీడర్ అశోక్ గజపతి రాజుకు గోవా గవర్నర్‌గా అవకాశం దక్కింది. ఇప్పుడు మరో సీనియర్ నేత యనమల వంతు వచ్చిందని..ఆయనకు రాజ్యసభ సీటు రిజర్వ్ అయిందని చెబుతున్నారు. త్వరలోనే చంద్రబాబు నోట యనమలకు గుడ్ న్యూస్‌ను వినిపించబోతున్నారని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. అయితే ఈ మధ్యే యనమల అల్లుడు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ డ్రగ్స్ కేసులో ఇరుక్కోవడం పెద్ద రచ్చగా మారింది. ఆ ఎఫెక్ట్‌తో యనమల అవకాశాలు ఏమైనా పోతాయా అనే ప్రచారం నడుస్తుండగా..అలాంటిదేమీ లేదని అంటున్నారు. యనమల టీడీపీ పుట్టినప్పటి నుంచి నిబద్ధతతో పార్టీకి సేవ చేస్తున్న లీడర్. ఆయన అనుభవం, పార్టీకి చేసిన సేవ లెక్కలోకి వస్తాయని చెబుతున్నారు. మొత్తానికి యనమల పెద్దల సభలోకి అడుగు పెట్టాలన్న కోరిక మరో రెండు నెలలలో తీరిపోతుందని అంటున్నారు. లాస్ట్ మినిట్ ఏమైనా మార్పులు చేర్పులు జరుగుతాయా? లేక యనమలకు బెర్త్ పక్కానా అనేవి చూడాలి.

# డ్యామేజ్ కంట్రోల్ కోసం వైసీపీ రూట్ మార్చిందా?



**విశాఖపట్టణం, మార్చి 24 పెన్ పవర్:** ఏపీ పాలిటిక్స్‌లో గాజువాకకు స్పెషల్ పొలిటికల్ బ్యాగ్రౌండ్ ఉంది. మిగిలిన నియోజకవర్గాల్లాగా..ఇక్కడ క్యాస్ట్ పాలిటిక్స్ చేయడం అంత ఈజీ కాదన్న అభిప్రాయం ఉంది. అయితే గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగానే కాదు..గాజువాకలోనూ వైసీపీ వేసిన వ్యూహాలు ఏ మాత్రం వర్కౌట్ కాలేదు. ఘోర పరాజయం తప్పలేదు. దీంతో ఇప్పుడు లోకల్ బాడీ ఎన్నికలకు ముందు వైసీపీ పెద్దలు కాస్త అలర్ట్ అయినట్లు కనిపిస్తోంది. గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని వైసీపీ స్టేట్ పొలిటికల్ అఫైర్స్ కమిటీలో సభ్యుడిగా నియమించింది. వైసీపీకి పీఏసీ అనేది చాలా ప్రెస్టీజియస్. సీనియర్ లీడర్లు, మాజీ మంత్రులు, కీలక నేతలకు మాత్రమే చోటు దక్కుతుంది. కానీ గాజువాకలో కేవలం ఒకే ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన తిప్పల నాగిరెడ్డిని పీఏసీలోకి తీసుకోవడం వెనుక వైసీపీ స్ట్రాటజీ ఏంటన్నది విశాఖ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. నాగిరెడ్డి కేవలం ఒకే ఒక్కసారి గెలిచినా సరే సంచలన విజయాన్ని రికార్డు క్రియేట్ చేశారు. 2019లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను 16వేల ఓట్లతో ఓడించి తన పేరు రీసౌండ్ చేసేలా గుర్తింపు పొందారు. అయితే మాత్రం ఏం లాభం..గత ఎన్నికల్లో వైసీపీ అనూహ్యంగా ఆయన్ను పక్కన పెట్టింది. వృద్ధాప్యం..అనారోగ్యం..కారణంగా తన కుమారుల్లో ఎవరో ఒకరికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలంటూ నాగిరెడ్డి హైకమాండ్‌కు ఛాయిస్ ఇచ్చి సైలెంట్ అయిపోయారు. పవన్‌ను ఓడించిన నేతగా నాగిరెడ్డికి క్రెడిట్ ఉన్నా తన కుమారులకు టికెట్ ఇవ్వాలంటూ ఆయన చేసిన రిక్వెస్ట్‌ను వైసీపీ అధిష్టానం లైట్ తీసుకుంది. క్యాస్ట్ ఈక్వేషన్స్‌తో యాదవ సామాజికవర్గానికి చెందిన నేతను బరిలో నిలిపితే విజయం వరిస్తుందని అంచనా వేసి ఉరుకూటి చందు అనే నేతకు నియోజకవర్గ బాధ్యతలు కూడా అప్పగించారు. వైసీపీ తీసుకున్న ఈ నిర్ణయం గాజువాకలో గందరగోళం సృష్టించినా సరే పార్టీ పెద్దలు వెనక్కి తగ్గలేదు. యాదవ సామాజికవర్గానికి చెందిన ఉరుకూటి చందుకే టికెట్ అనే సంకేతాలను బలంగా పంపారు. అంతా బాగానే ఉందనుకున్న సమయంలో..కాపు సామాజికవర్గానికి చెందిన గుడివాడ అమర్‌నాథ్‌ను లాస్ట్ మినిట్‌లో గాజువాక బరిలోకి దించారు. కూటమి తరుపున యాదవ సామాజికవర్గ నేత పల్లా శ్రీనివాసరావు బరిలోకి దిగడంతో..కాపు ఈక్వేషన్స్..స్టీల్ ప్లాంట్ పరిరక్షణ అంటూ వైసీపీ వేసిన స్కెచ్‌లన్నీ గాల్లో కొట్టుకుపోయాయి. రాష్ట్రంలోని 175 ఎమ్మెల్యేల్లో..గాజువాకలోనే టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌కు అత్యధిక మెజార్టీ వచ్చింది. ఘోర ఓటమి తర్వాత ఇప్పుడు వైసీపీ పెద్దలకు అసలు సీన్ అర్థమైందన్న టాక్ వినిపిస్తోంది. త్వరలో స్థానిక, విశాఖ కార్పొరేషన్ ఎన్నికలు రానుండటంతో పట్టు నిలుపుకోవాలన్న ఉద్దేశంతో కీలక నిర్ణయాలు తీసుకుంటుందట. ఇందులో భాగంగా తిప్పల నాగిరెడ్డిని మళ్లీ తెరపైకి తెచ్చారని అంటున్నారు. అప్పటికే అనారోగ్యంతో ఉన్నానని, వయోభారంతో రాజకీయాల్లో కొనసాగలేనని రెండేళ్ల క్రితమే చేతులెత్తేసిన తిప్పల నాగిరెడ్డిని మళ్లీ పొలిటికల్ స్క్రీన్ తెస్తూ..పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ మెంబర్‌గా నియమించింది. ఈ నిర్ణయం వెనుక వైసీపీ పెద్ద కసరత్తే చేసిందన్న టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం వైసీపీకి గాజువాకలో దిక్కూమొక్కూ లేదు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన గుడివాడ అమర్‌నాథ్ చోడవరం నియోజకవర్గానికి వెళ్లిపోయారు. దీంతో వైసీపీకి నియోజకవర్గాన్ని నడిపే నాయకుడు కరువయ్యాడు. గ్రేటర్ విశాఖ సిటీలోనే ఇలాంటి దుస్థితి ఉంటే కష్టమని భావించి నాగిరెడ్డికి హితబోధ చేసి మరీ ఈ బాధ్యతలు అప్పగించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో టికెట్ సంగతి తర్వాత ముందు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని నాగిరెడ్డికి టాస్క్ ఇచ్చారట. చెరోదారిలో వెళ్లిపోయిన తన కుమారులను కూడా దారికి తెచ్చుకుని పార్టీకో దారి చూపిస్తారనే ఆశలతోనే వైసీపీ నాగిరెడ్డికి పీఏసీ చాన్స్ ఇచ్చారని అంటున్నారు. కూటమి నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని నాగిరెడ్డి గాజువాకలో వైసీపీకి పూర్వవైభవం తీసుకొస్తారో లేదో చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ట్రంప్ మరో గేమ్ ?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధంలో సోమవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. 'ఇరాన్‌తో రెండు రోజులుగా సానుకూలంగా చర్చలు జరుగుతున్నాయి. అందువల్ల ఇరాన్ విద్యుత్ ప్లాంట్లు, ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేస్తున్నాం.' అంటూ సోషల్ మీడియాలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన పోస్టు కలకలం రేపింది. 'హార్ముజ్ జలసంధిని తెరవకపోతే ..' అంటూ ఆయన విధించిన డెడ్‌లైన్ మరి కొన్ని గంటల్లో ముగియనుండటంతో ఏ క్షణమైనా భీకర దాడులు ప్రారంభమవుతాయని ప్రపంచమంతా ఆందోళన చెందుతున్న సమయంలో ఈ పోస్ట్ వెలువడింది. ట్రంప్ సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్'లో ప్రత్యక్షమైన ఈ పోస్ట్ ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సోమవారం సాయంత్రం ఈ ప్రకటన చేసిన తరువాత మూడుసార్లు విలేకరులతో మాట్లాడిన ట్రంప్ ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని, ఒక కీలకమైన నేతతో మాట్లాడుతున్నామని, మంచి డీల్ కుదురుతుందని, ఇజ్రాయిల్‌కు కూడా ఈ డీల్ నచ్చుతుందని చెప్పారు. అయితే, చర్చలే జరగలేదని, అటువంటి అవకాశమే లేదని ఇరాన్ ప్రకటించడంతో ట్రంప్ చేసిన ఈ ప్రకటనల వెనుక మతలబేంటన్న దానిపై రకరకాల విశ్లేషణలు వెలువడ్డాయి. ట్రంప్ మరో గేమ్‌కు తెరతీశారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తగ్గట్టే ట్రంప్ పోస్ట్‌పై అమెరికా నుండి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇజ్రాయిల్ ఇరాన్‌పై దాడులు కొనసాగించింది. ట్రంప్ ప్రకటనపై పెదవి విప్పడానికి ఇజ్రాయిల్ నేతలు సిద్ధపడలేదు.

## అగ్నిమాపక వాహనాన్ని ఢీకొట్టిన ఎయిర్ కెనడా విమానం

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలోని న్యూయార్క్ విమానాశ్రయంలో ఎయిర్ కెనడా విమానం అగ్నిమాపక వాహనాన్నిఢీ కొట్టింది. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి 11.40 గంటలకు లాగార్డియా విమానాశ్రయంలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో విమానం ముందుభాగం పూర్తిగా ధ్వంసం కాగా, వెనుక భాగం రన్‌వేపై పడినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో పైలెట్, కో పైలెట్ మరణించగా, అగ్నిమాపక వాహనం సిబ్బంది గాయపడినట్లు సమాచారం.కెనడాలోని మాంట్రియల్ నుండి వస్తున్న ఎయిర్ కెనడాకు చెందిన జాజ్ ఏవియేషన్ విమానం లాగార్డియా విమానాశ్రయంలోని 4వ రన్‌వేపై దిగింది. టాక్సీయింగ్ వైపు వెళ్తుండగా రన్‌వైపై ఉన్న అగ్నిమాపక వాహానాన్నిఢీ కొట్టిందని ఫోర్ట్ అథారిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రమాదం జరిగిన వెంటనే విమానాశ్రయ రన్‌వేను మూసివేసినట్లు తెలిపింది. విమానంలో 72మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారని జాజ్ ఏవియేషన్ పేర్కొంది. ఈ ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంపై దర్యాప్తుకు ఆదేశించినట్లు తెలిపింది.

## కెన్యాలో వర్షాలు వరదల వల్ల 80 మందికిపైగా మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** కెన్యాలో వర్షం బీభత్సం సృష్టించింది. వర్షాలు వరదల వల్ల 81 మంది మృతి చెందారని కెన్యా నేషనల్ పోలీస్ సర్వీస్ (ఎన్‌పిఎస్) ఆదివారం వెల్లడించింది. ఈ వర్షాలకు అత్యధికంగా దేశ రాజధాని నైరోబి తీవ్ర ప్రభావితమైంది. నైరోబిలో అత్యధిక ప్రాణ నష్టం జరిగింది. ఈ వర్షాలకు నైరోబిలో 37 మంది చనిపోయారు. ఇక తూర్పు ప్రాంతంలో 21, తీర ప్రాంతంలో 5, న్యాంజా ప్రాంతంలో 7, రిఫ్ట్ వ్యాలీలో 8, కెన్యాలోని మధ్య ప్రాంతంలో 3 మరణాలు సంభవించాయని ఎన్‌పిఎస్ ప్రకటన పేర్కొంది. కాగా, వరదల వల్ల పలు ప్రాంతాల్లో రోడ్లు, మార్కెట్లు, రహదారులు, నీరు, విద్యుత్ మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. 2,690 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాబోయే 48 గంటల్లో కూడా నైరోబి, కెన్యా మధ్య, తూర్పు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కెన్యా వాతావరణ శాఖ (కెఎండి) హెచ్చరించింది.

## నా భార్యను అడ్డుపెట్టుకొని నన్ను బ్లాక్ మెయిల్ చేస్తున్నారు

**హైదరాబాద్ పెన్ పవర్:** పాక్ మాజీ ప్రధాని, క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్ జైలు కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్న ఇమ్రాన్ ఖాన్.. తన భార్య బుష్రా బీబీతో జైలు అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. తనను బ్లాక్ మెయిల్ చేయడానికి ఆమెను ఓ సాధనంగా వాడుకుంటున్నారని పాకిస్థాన్ న్యాయవ్యవస్థను విమర్శించారు. ఆయన ఈ విషయాలను ఈద్ సందర్భంగా తన కుమారుడు ఖాసింతో పంచుకున్నట్లు సమాచారం. 'పాకిస్థాన్‌లోని న్యాయమూర్తులు సిగ్గుపడాలి. మేము పదేపదే న్యాయవ్యవస్థను ఆశ్రయించాం. కానీ వారు వ్యక్తిగత లాభం కోసం మాకు అన్యాయం చేస్తున్నారు. నన్ను లొంగదీసుకోలేమని వారికి తెలుసు. అందుకే వారు నా భార్యను అడ్డుపెట్టుకుంటున్నారు. కేవలం నన్ను బ్లాక్‌మెయిల్ చేయడానికి, బుష్రా బీబీ చికిత్స విషయంలో అమానుషంగా ప్రవర్తిస్తున్నారు' అని ఇమ్రాన్ ఖాన్ ఆవేదన వ్యక్తంచేసినట్లు ఓ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైంది. అలాగే ఆమెను జైలులో ఒంటరిని చేశారని ఆయన ఆరోపిస్తున్నారు. 'బుష్రా బీబీని పూర్తి ఐసోలేషన్‌లో పెట్టారు. నాతో మాట్లాడటానికి వారానికి కేవలం 30 నిమిషాలు మాత్రమే అనుమతిస్తున్నారు. దానికి కూడా తరచూ నిరాకరిస్తున్నారు' ఇమ్రాన్‌ఖాన్ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

## రష్యా ఇంటెలిజెన్స్ సాయంతోనే.. పశ్చిమాసియాపై ఇరాన్ గురి:



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతోన్న నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సంచలన ఆరోపణలు చేశారు. అమెరికా, ఇజ్రాయెల్‌తో ఇరాన్ చేస్తున్న యుద్ధానికి రష్యా ఇంటెలిజెన్స్ సాయం అందిస్తోందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి తనవద్ద కచ్చితమైన ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు జెలెన్‌స్కీ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ఇరాన్ ప్రభుత్వానికి రష్యా ఇంటెలిజెన్స్ మద్దతు అందిస్తోంది. ఇందుకు తమ వద్ద కచ్చితమైన ఆధారాలు ఉన్నాయి. ఇది విధ్వంసకర చర్య. దీన్ని వెంటనే ఆపాలి. లేదంటే పరిస్థితి మరింత దిగజారుతుంది' అని జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తంచేశారు. అనేక దేశాలు సంక్షోభాన్ని నివారించే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. యుద్ధం నేపథ్యంలో మార్కెట్లు ప్రతికూలంగా ఉన్నాయని, పలు దేశాల్లో ఇంధన సరఫరాపై గందరగోళం నెలకొందన్నారు. ఇరాన్ పాలన నిలదొక్కుకోవడానికి.. అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యాలపై ఆ దేశం కచ్చితమైన దాడులు చేయడానికి రష్యా సాయపడటాన్ని తప్పుబట్టారు. దీని కారణంగా యుద్ధం మరిన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందన్నారు. దీనిపై వెంటనే ప్రతిస్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

# తీవ్రమైన చమురు సంక్షోభం ఎదుర్కొంటున్నాం



**హైదరాబాద్ పెన్ పవర్:** గతంలో సంభవించిన రెండు సంక్షోభాల కన్నా ప్రస్తుతం తీవ్రమైన చమురు సంక్షోభాన్ని ప్రపంచం ఎదుర్కొంటోందని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఎ) చీఫ్ ఫతిహ్ బిరోల్ అన్నారు. కాన్బెర్రాలోని నేషనల్ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఆస్ట్రేలియాలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఇరాన్పై అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభం, 1973, 1979 నాటి చమురు సంక్షోభాలు, 2022లో ఉక్రెయిన్పై రష్యా దాడి ఫలితంగా తలెత్తిన గ్యాస్ కొరతను కూడా మించిపోయిందని అన్నారు. వాస్తవ పరిస్థితుల ప్రకారం.. ప్రస్తుత సంక్షోభం గత రెండు చమురు సంక్షోభాలు, గ్యాస్ పతనం కలిసినట్లుగా ఉందని తెలిపారు. హార్ముజ్ జలసంధిని మూసివేయడం, ఇంధన సౌకర్యాలపై జరిగిన దాడుల కారణంగా ప్రపంచ చమురు సరఫరా రోజుకి సుమారు 11 మిలియన్ బ్యారెళ్ల (బిపిడి) మేర తగ్గిందని, ఇది 1970ల నాటి రెండు సంక్షోభాల కొరత కంటే రెట్టింపును దాటిందని బిరోల్ పేర్కొన్నారు. ఉక్రెయిన్పై రష్యా దాడి చేసిన అనంతరం ఏర్పడిన 75 బిలియన్ క్యూబిక్ మీటర్ల కొరతతో పోలిస్తే, లిక్విడ్ సహజవాయువు (ఎల్ఎన్ఎ) సరఫరా సుమారు 140 బిలియన్ క్యూబిక్ మీటర్ల మేర తగ్గిందని అన్నారు. తొమ్మిది దేశాల్లోని సుమారు

40 చమురు సౌకర్యాలు దెబ్బతిన్నాయని చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అతి పెద్ద ముప్పును ఎదుర్కొంటుందని, కానీ వీలైనంత త్వరగా ఈ సమస్య పరిష్కారమౌతుందని తాను ఆశిస్తున్నానని అన్నారు. అవసరమైతే వ్యూహాత్మక చమురు నిల్వలను విడుదల చేయాల్సిందిగా పలు దేశాలతో తాను చర్చిస్తున్నానని అన్నారు. అలాగే, ఈ సంక్షోభానికి ఏకైక అత్యంత ప్రధానమైన పరిష్కారం హార్ముజ్ జలసంధిని తెవరడమేనని ఆయన పేర్కొన్నారు.

# ప్రపంచంలో 1970ల నాటికన్నా తీవ్రమైన చమురు సంక్షోభం

**హైదరాబాద్ పెన్ పవర్:** 1970ల నాటి రెండు సంక్షోభాల కన్నా తీవ్రమైన చమురు సంక్షోభాన్ని ప్రపంచం ఎదుర్కొంటోందని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఎ) చీఫ్ ఫతిహ్ బిరోల్ హెచ్చరించారు. కాన్‌బెర్రాలోని నేషనల్ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఆస్ట్రేలియాలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభం, 1973, 1979 నాటి చమురు సంక్షోభాలు మరియు 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడి ఫలితంగా తలెత్తిన గ్యాస్ కొరతను కూడా మించిపోయిందని అన్నారు. వాస్తవ పరిస్థితుల ప్రకారం.. ఈ సంక్షోభం ప్రస్తుతం రెండు చమురు సంక్షోభాలు మరియు గ్యాస్ పతనం కలిసినట్లుగా ఉందని అన్నారు. హార్ముజ్ జలసంధిని మూసివేయడం మరియు ఇంధన సౌకర్యాలపై జరిగిన దాడుల కారణంగా ప్రపంచ చమురు సరఫరా రోజుకి సుమారు 11 మిలియన్ బ్యారెళ్ల (బిపిడి) మేర తగ్గిందని, ఇది



1970ల నాటి రెండు సంక్షోభాల కొరత కంటే రెట్టింపును దాటిందని బిరోల్ పేర్కొన్నారు. రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేసిన అనంతరం ఏర్పడిన 75 బిలియన్ క్యూబిక్ మీటర్ల కొరతతో పోలిస్తే, లిక్విడ్ సహజవాయువు (ఎల్ఎన్‌జి) సరఫరా సుమారు 140 బిలియన్ క్యూబిక్ మీటర్ల మేర తగ్గిందని అన్నారు. తొమ్మిది దేశాల్లోని సుమారు 40 చమురు సౌకర్యాలు దెబ్బతిన్నాయని చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అతిపెద్ద ముప్పును ఎదుర్కొంటుందని, వీలైనంత త్వరగా ఈసమస్య పరిష్కారమౌతుందని తాను ఆశిస్తున్నానని అన్నారు. అవసరమైతే వ్యూహాత్మక చమురు నిల్వలను విడుదల చేయాల్సిందిగా పలు దేశాలతో తాను చర్చిస్తున్నానని అన్నారు. అయితే ఈ సంక్షోభానికి ఏకైక అత్యంత ప్రధానమైన పరిష్కారం హార్ముజ్ జలసంధిని తెవరడమేనని స్పష్టం చేశారు.

# కూలిన కొలంబియా యుద్ధ విమానం



**హైదరాబాద్ పెన్ పవర్:** కొలంబియా వైమానిక దళానికి చెందిన 'లాక్ హీడ్ మార్టిన్ హెర్క్యులస్ సి-130' రవాణా విమానం కూలిపోయింది. దక్షిణ కొలంబియాలోని పుట్యుమాయో ప్రావిన్స్‌లో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. దీనిలో సుమారు 110 మంది సైనికులు ప్రయాణిస్తున్నారని, వీరిలో వందమందికి పైగా సైనికులు మరణించారని స్థానిక మీడియా సంస్థ బ్లూ రేడియో వెల్లడించింది. పెరూ సరిహద్దుకు సమీపంలోని ప్యూరీర్టో లెగుయిజామో ఎయిర్‌ఫీల్డ్ నుంచి ఈ విమానం టేకాఫ్ తీసుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. విమానం నేలపై పడగానే భారీగా మంటలు చెలరేగాయి. అమెజాన్ అడవుల మధ్య ఉన్న దక్షిణ సరి హద్దు ప్రాంతంలో భద్రతా దళాలను తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని కొలంబియా రక్షణ మంత్రి పెడ్రో ఆర్నుల్ఫో సాంచెజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమా దానికి గల కారణాలు ఇంకా తెలియ రాలేదని, సాంకేతిక లోపం వల్ల జరిగిందా

లేదా ఇతర కారణాలా? అనే కోణంలో విచారణ జరుపుతున్నామని మంత్రి తెలిపారు. ప్రమాద సమయంలో విమానంలో 80 నుంచి 110 మంది వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే సైనిక విభా గాలు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి.

# ఎన్నికల్లో నిర్ణయాత్మక విజయం

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో నిరంతర అభివృద్ధి, సంక్షేమం కొనసాగింపు అత్యవసరమని ప్రజలు భావిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ నిర్ణయాత్మక విజయం సాధిస్తుందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లే లక్ష్యంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ మరోసారి ప్రజాతీర్పును కోరుతోందని చెప్పారు. కేరళలోని తిరువల్లలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. లౌకికవాదం, ప్రజాస్వామ్య విలువలను నిలబెడుతూనే, ప్రగతి, ప్రజా సంక్షేమం కొనసాగేలా చూసేందుకు ప్రజలు ఏకం కావడానికి ఈ ఎన్నికలు ఒక చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. 'అభివృద్ధి, ప్రజా సంక్షేమం అనేవి మేము ప్రజల ముందుంచుతున్న ప్రధాన అంశాలు' అని అన్నారు. మితవాద శక్తులు తప్పుడు ప్రచారాలు చేస్తూ మతతత్వాన్ని ఉపయోగించి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్, బిజెపి అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల పట్ల కేరళకు నష్టం జరుగుతోందని, ఆ రెండు పార్టీలు కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిన మానవతావాద ప్రత్యామ్నాయ నమూనా ఆచరణయోగ్యమైనదని గత పదేళ్లు నిరూపించాయి. అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టో హామీలను పక్కనపెట్టే రాజకీయ సంస్కృతి కేరళకు విరుద్ధం' అని అన్నారు. 'గత కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ప్రభుత్వం హయాంలో రాష్ట్రం పూర్తిగా కుప్పకూలిపోయింది. నియామకాలు లేవు. ప్రభుత్వరంగం కుప్పకూలిపోయింది. ప్రభుత్వ విద్యా సంస్థలు మూసివేశారు. అవినీతిమయ పాలన, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో స్తబ్దత, పారిశ్రామిక పెట్టుబడుల పట్ల విముఖత. తీవ్రమైన ఆర్థిక సంక్షోభంతో రాష్ట్రం అతలాకుతలం అయింది' అని విజయన్ విమర్శించారు. 'యుడిఎఫ్ పాలనలో సంక్షేమ పింఛన్ బకాయిలు 18 నెలల వరకు పేరుకుపోయాయి. వైద్యులు, మందుల కొరతతో ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ అధ్వాన స్థితిలో ఉండేది' అని విమర్శించారు. 'ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు డ్రాపౌట్స్ భారీగా ఉండేవి. పాఠ్యపుస్తకాలను సకాలంలో పంపిణీ చేయకపోవడంతో విద్యార్థులు జెరాక్స్ కాపీలపై ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చేది. లాభం లేదనే కారణంతో పాఠశాలలను మూసివేశారు' అని పేర్కొన్నారు. యుడిఎఫ్ హయాంలో ఉన్నత విద్యా రంగంలో ఎలాంటి ముఖ్యమైన కార్యక్రమాలు చేపట్టలేదని, విద్యా ప్రమాణాలను నీరుగార్చే ప్రయత్నాలు జరిగాయని పినరయి విజయన్ విమర్శించారు. ప్రజా పంపిణీ, రవాణా వ్యవస్థలను పూర్తిగా బలహీన పరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి చీకటి దశ నుంచి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం కేరళ పునర్నిర్మాణ చారిత్రక బాధ్యతను చేపట్టి, ప్రతి రంగాన్ని పునరుజ్జీవింపజేసిందని పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో సాధించిన విజయాలు దేశానికే వన్నె తెచ్చాయని అన్నారు. సామాన్య ప్రజల పట్ల ప్రభుత్వ నిబద్ధత స్పష్టంగా నిలుస్తోందని విజయన్ పేర్కొన్నారు. '2016లో యుడిఎఫ్ ప్రభుత్వం ఓటమి చెందినప్పుడు ఆరోగ్య రంగానికి బడ్జెట్ కేటాయింపు రూ.665 కోట్లుగా ఉండేది. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం హయాంలో దీనిని రూ.3 వేల కోట్లకు పైగా పెంచాం' అని అన్నారు.

# ట్రంప్ నిర్ణయంతో ఊపందుకున్న మార్కెట్లు




దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం శక్తివంతమైన లాభాలతో ప్రారంభమయ్యాయి. ఇరాన్‌పై జరగాల్సిన దాడులను నిలిపివేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం ప్రభావంతో అంతర్జాతీయంగా చమురు ధరలు గణనీయంగా తగ్గాయి. ఈ పరిణామం ప్రపంచ మార్కెట్లలో సానుకూల వాతావరణాన్ని సృష్టించగా, దాని ప్రభావం భారత మార్కెట్లపై కూడా స్పష్టంగా కనిపించింది. ట్రేడింగ్ ప్రారంభంలోనే బిఎస్ఈ సెన్సెక్స్ సుమారు 1000 పాయింట్లకు పైగా ఎగసి 73,775 స్థాయికి చేరగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కూడా 300 పాయింట్లకు పైగా లాభపడి 22,848.80 వద్ద కొనసాగింది. అయితే, ఈ లాభాల మధ్య రూపాయి మాత్రం బలహీనంగానే కొనసాగుతూ మరో 18 పైసలు పడిపోయి 93.71 వద్ద ట్రేడ్ అవుతోంది. రంగాల వారీగా చూస్తే ఆటో, బ్యాంకింగ్, ఎనర్జీ, ఫార్మా షేర్లు 1-2 శాతం వరకు లాభాల్లో నిలిచాయి. ముఖ్యంగా ఏషియన్ పెయింట్స్, శ్రీరామ్ ఫైనాన్స్, టైటాన్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, గ్రాసిమ్ ఇండిస్ట్రీస్ వంటి కంపెనీల షేర్లు మంచి ప్రదర్శన చూపుతున్నాయి. అంతర్జాతీయంగా కూడా మార్కెట్లలో సానుకూల ధోరణి కనిపిస్తోంది. జపాన్ నిక్కీ, దక్షిణ కొరియా కోస్పి, ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ సూచీలు లాభాల్లో కొనసాగుతున్నాయి. మరోవైపు, సోమవారం అమెరికా మార్కెట్లు కూడా గ్రీన్‌లో ముగిశాయి. ఇక బ్రెంట్ క్రూడ్ ధరలు దాదాపు 13 శాతం పడిపోవడంతో 99 డాలర్ల వద్ద స్థిరపడటం గమనార్హం. ఇది పెట్టుబడిదారుల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసింది.

# నిర్మాణ వ్యయం, ఇళ్ల ధరలు పెరిగే అవకాశం



పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఎక్కువ కాలం కొనసాగితే ముడి సరకు వ్యయం పెరిగి, అంతిమంగా ఇళ్ల ధరల పెరుగుదలకు దారి తీస్తుందని స్థిరాస్తి సంఘాలైన క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు శేఖర్ పటేల్, నారెడ్కో అధ్యక్షుడు పర్వీన్ జైన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా 20,000 మంది డెవలపర్లకు ఈ సంఘాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. నిర్మాణ సామగ్రి కొరత వల్ల, కొన్ని స్థిరాస్తి ప్రాజెక్టులు పూర్తి కావడంలో జాప్యం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నాయి. 'కీలక ముడి సరకు దేశీయంగానే ఉత్పత్తి అవుతున్నందున, భారతీయ స్థిరాస్తి రంగం చాలావరకూ స్థిరంగానే ఉంది. అంతర్జాతీయంగా ఇంధన ధరల్లో హెచ్చుతగ్గుల కారణంగా, సరఫరా వ్యవస్థల్లో తాత్కాలిక అంతరాయాలు ఏర్పడుతున్నాయని' అని శేఖర్ పటేల్ వివరించారు. ఇంధన సరఫరా ఇబ్బందుల వల్ల గుజరాత్‌లోని మోర్బీలో మార్బుల్, టైల్స్ తయారీ కేంద్రాల్లో కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడుతోందని, రవాణా రంగానికి స్వల్పకాలిక సవాళ్లు ఎదురవుతున్నాయని పటేల్ తెలిపారు. 'ప్రస్తుతం స్టీల్, పీవీసీ ఉత్పత్తులు, వైర్లు, పైపులు, అద్దాలు వంటి కీలక సామగ్రికి కొరత ఉంది. ఇంధన సంబంధిత సవాళ్ల కారణంగా సిరామిక్ ఉత్పత్తుల తయారీ రంగం దెబ్బతింది. యుద్ధం దీర్ఘకాలంపాటు కొనసాగితే, నిర్మాణ వ్యయాలు పెరుగుతాయ'ని అని నారెడ్కో అధ్యక్షుడు పర్వీన్ జైన్ పేర్కొన్నారు. వ్యయాలను డెవలపర్లు వీలైనంత మేర నియంత్రిస్తున్నారని.. అయినా ముడి సరకు ధరలపై ఒత్తిడి కొనసాగితే, అంతిమంగా ప్రాజెక్టు ధరలపై ప్రతిఫలిస్తుందని.. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ మద్దతు చాలా ముఖ్యమని పేర్కొన్నారు.

# ఇన్‌సైడర్ పరిధిలోకి సెబీ ఛైర్మన్



'పరస్పర విరుద్ధ ప్రయోజనాలు', సెబీ అధికారుల వెల్లడి నిబంధనలపై ఉన్నత స్థాయి కమిటీ చేసిన పలు సిఫారసులను సెబీ బోర్డు సోమవారం ఆమోదించింది. ఈ కమిటీకి విజిలెన్స్ మాజీ చీఫ్ కమిషనర్ ప్రత్యూష్ సిన్హా అధ్యక్షత వహించారు. సెబీ సభ్యులు, అధికారుల ఆస్తులు, పెట్టుబడులు, రుణాలు, ఇతర సంబంధిత విషయాల వెల్లడికి సంబంధించిన ప్రస్తుత నిబంధనలను సమగ్రంగా సమీక్షించడానికి ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సెబీ ఛైర్మన్, పూర్తి స్థాయి సభ్యులను కూడా 'ఇన్‌సైడర్' పరిధిలోకి తీసుకురానున్నట్లు సెబీ తెలిపింది. బోర్డు సభ్యులు, ఉద్యోగులు విధుల్లో చేరినప్పుడు, ఏటా, నిర్దిష్ట సందర్భాల్లో, విధులను వదిలి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా వారి ఆర్థిక వివరాలను వెల్లడించాలని కమిటీ సూచించింది. తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) వివరాల వెల్లడిని సులభతరం చేసి మదుపర్లకు మరింత అనుకూలంగా మార్చే ఉద్దేశంతో ఆఫర్ పత్రాలను సంక్షిప్త రూపంలో అందించే విధానాన్ని సెబీ అందుబాటులోకి తెచ్చింది. ఐపీఓ వివరాలను పూర్తి స్థాయిలో పొందుపరిచే డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్‌తో పాటు.. సంక్షిప్త రూపంలో తెలియజేసే డ్రాఫ్ట్ అబ్రిడ్జెడ్ ప్రాస్పెక్టస్‌ను కూడా పబ్లిక్ ఇష్యూకు వచ్చే కంపెనీలు ఇకపై సమర్పించాల్సి ఉంటుంది. వ్యాపార విధానం, ఆర్థిక పరమైన అంశాలు, ప్రమోటర్లు, రిస్కులు, కీలక పనితీరు సూచీల వివరాలు సులువుగా అర్థం చేసుకునేలా ఈ పత్రంలో ఉండనున్నాయి. ఇష్యూకు రాబోయే కంపెనీ వెబ్‌సైట్, ఎక్కడైతే షేర్లు నమోదు చేయనుందో, ఆ స్టాక్‌ఎక్స్ఛేంజీలు, లీడ్ మేనేజర్ల వద్ద ఈ అబ్రిడ్జెడ్ ప్రాస్పెక్టస్‌ను అందుబాటులో ఉంచాలని సెబీ తెలిపింది. ఈ సంక్షిప్త పత్రాల్లో కంపెనీ ప్రాథమిక వ్యాపార వివరాలను 500 పదాల్లోపే తెలియజేయాల్సి ఉంటుంది.

# మరోసారి తగ్గిన బంగారం ధరలు

గతంలో భారీగా పెరిగిన బంగారం ధరలు గత 10 రోజులుగా వరుసగా తగ్గుతూ వస్తున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధ ఉద్రిక్తతలు కొంత తగ్గే సూచనలు కనిపిస్తుండటం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై తీసుకున్న తాజా నిర్ణయాలు అంతర్జాతీయ మార్కెట్లో పసిడిపై ఒత్తిడిని పెంచాయి. దీంతో బంగారం రేట్లు తగ్గడం మొదలైనట్లు నిపుణులు చెబుతున్నారు. తాజాగా మంగళవారం ప్రారంభంలో కూడా హైదరాబాద్ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు భారీగా పతనమయ్యాయి. తాజాగా 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర ఏకంగా రూ.2,940 తగ్గి రూ.1,40,350కి చేరుకుంది. అదేవిధంగా, ఆభరణాల తయారీలో ఎక్కువగా ఉపయోగించే 22 క్యారెట్ల పసిడి ధర రూ.2,700 మేర క్షీణించి రూ.1,28,650 పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న అనిశ్చితి, డాలర్ విలువలో మార్పుల కారణంగా స్థానిక మార్కెట్లో కూడా బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. వివాహాది శుభకార్యాల సీజన్ నడుస్తున్న వేళ, ధరలు ఈ స్థాయిలో తగ్గడం సామాన్య వినియోగదారులకు మరియు పెట్టుబడిదారులకు పెద్ద ఊరటనిస్తుంది. బంగారం ధరలు ఇంత భారీగా తగ్గడానికి ప్రధానంగా అంతర్జాతీయ పరిణామాలు కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం నుండి క్రమంగా స్టాక్ మార్కెట్ల వైపు మళ్లుతుండటంతో గిరాకీ తగ్గింది. వీటికి తోడు, దేశీయంగా దిగుమతి సుంకాలు మరియు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువలో వస్తున్న స్థిరత్వం కూడా ధరల తగ్గుదలకు దోహదపడ్డాయి. రానున్న రోజుల్లో కూడా అంతర్జాతీయ మార్కెట్ ధోరణిని బట్టి ధరల్లో మరిన్ని హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# బ్యాంక్‌లకు నగదు కటకట



భారత బ్యాంకింగ్ వ్యవస్థ తీవ్ర నగదు కొరతను ఎదుర్కొంటుంది. బ్యాంక్‌ల్లో ద్రవ్య లభ్యత ఒక్కసారిగా భారీ లోటులోకి జారుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుండి మార్చి 15 వరకు రోజువారి సగటున రూ.2.50 లక్షల కోట్ల నగదు మిగులు ఉండగా.. ప్రస్తుతం అది రూ.65,900 కోట్ల (7.01 బిలియన్ డాలర్లు) లోటుకు చేరకుంది. ఇది గతేడాది డిసెంబర్ 29 తర్వాత నమోదైన అత్యధిక లోటు స్థాయి. ప్రస్తుతం పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. 2026 సంవత్సరంలో ఇంతటి స్థాయిలో నగదు కొరత ఏర్పడటం ఇదే తొలిసారి. ప్రధానంగా భారీగా పన్ను చెల్లింపులు జరగడం, విదేశీ మారక ద్రవ్య మార్కెట్‌లో రూపాయి తీవ్రంగా పతనం కావడంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తీసుకున్న చర్యలతో నగదు లభ్యత తగ్గింది. ఆర్థిక సంవత్సరం 2025-26 ముగింపు నేపథ్యంలో అడ్వాన్స్ టాక్స్, జిఎస్‌టి రూపంలో భారీగా నగదు బ్యాంకుల నుంచి బయటకు వెళ్లడం ప్రధాన కారణమని హెచ్‌డీఎఫ్‌సి బ్యాంక్ ప్రిన్సిపల్ ఎకనామిస్ట్ సాక్షి గుప్తా తెలిపారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతల వల్ల రూపాయి విలువపై ఒత్తిడి పెరిగింది. దీన్ని అడ్డుకునేందుకు మార్చి నెలలో ఆర్‌బిఐ సుమారు 20 బిలియన్ డాలర్ల మేర విదేశీ మారక ద్రవ్యాన్ని మార్కెట్‌లోకి విడుదల చేసింది. నగదు కొరత ప్రభావంతో స్వల్పకాలిక రుణాల రేట్లు ఆర్‌బిఐ పాలసీ రేటు 5.25 శాతం కంటే 10 బేసిస్ పాయింట్లు పెరిగి 5.35 శాతానికి పెరిగింది. ఇది బ్యాంక్‌ల్లోని నగదుపైనా ఒత్తిడి పెంచింది. ఆర్థిక ఒత్తిడి మార్చి 31 తర్వాత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపులో ప్రభుత్వం చేసే ఖర్చుల వల్ల తిరిగి వ్యవస్థలోకి నగదు చేరుతుందని అంచనా వేస్తోన్నారు.

# ఏప్రిల్‌లోనూ ఆసియాకు తగ్గనున్న చమురు సరఫరా



ప్రపంచంలోనే ప్రధాన చమురు ఎగుమతిదారు సౌదీ అరామ్కో ఆసియాకు ఏప్రిల్‌లో వరుసగా రెండవ నెల కూడా ఆసియాకు చమురు సరఫరాను తగ్గించినట్లు సంబంధిత వర్గాలు సోమవారం తెలిపాయి. ఏప్రిల్‌లో యాన్బులోని రెడ్‌సీ పోర్ట్ నుండి ఎగుమతి అయిన అరబ్ లైట్ క్రూడ్‌ను మాత్రమే సరఫరా చేయనున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఆసియా రిఫైనరీలకు సరఫరా తగ్గనుండటంతో శుద్ధి చేసిన ఉత్పత్తులపై పరిమితులు మరింత తీవ్రం కానున్నాయి. ఈ వార్తపై అరామ్కో స్పందించాల్సివుంది. సౌదీ అరేబియా మార్చిలో రోజుకి 4.355మిలియన్ బ్యారెల్స్‌ను ఎగుమతి చేసినట్లు క్ప్లర్ సంస్థ తెలిపింది. రోజుకి 7.108 మిలియన్ బ్యారెల్స్‌ను ఎగుమతి చేసిన ఫిబ్రవరి నెలతో పోలిస్తే ఎగుమతి తగ్గినట్లు సంస్థ పేర్కొంది. హోర్ముజ్ జలసంధిలో ఏర్పడిన అంతరాయాన్ని భర్తీ చేసేందుకు అరామ్కో సంస్థ యాన్బు పోర్ట్ నుండి ముడి చమురు ఎగుమతిని పెంచేందుకు యత్నిస్తోంది. దీంతో మార్చిలో లోడింగ్ రికార్డు స్థాయికి పెరుగుతాయని అంచనావేస్తోంది. చైనా సంస్థ సినోపెక్, మార్చిలో యాన్బు పోర్ట్ నుండి సుమారు 24 మిలియన్ బ్యారెల్ల సౌదీ ముడిచమురును పంపిణీ చేసేందుకు యత్నిస్తోంది. సౌదీ అరామ్కోకి చెందిన సమ్రెఫ్ రిఫైనరీ సమీపంలో ఒక డ్రోన్ కూలిపోవడంతో, గురువారం (మార్చి 19న ) యాన్బు పోర్ట్‌లో చమురు లోడింగ్‌కు కొంతసేపు అంతరాయం కలిగిన సంగతి తెలిసిందే.

# మోడీ హయాంలో రూపాయి మహా పతనం



అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ రోజురోజుకు అత్యంత అధ్వానంగా మారుతోంది. భారత దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా ప్రధాని మోడీ హయంలో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 94 మార్క్‌కు క్షీణించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరగడం, భారత్ నుంచి విదేశీ ఇన్వెస్టర్లు భారీగా నిధులను ఉపసంహరించుకోవడంతో సోమవారం అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 50 పైసలు పతనమై రికార్డు స్థాయిలో 94.03కు దిగజారింది. ఉదయం ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో 93.84 వద్ద తెరుచుకున్న రూపాయి.. వెంటనే 94కు పడిపోయింది. శుక్రవారం 64 పైసలు క్షీణించి 93.53 కనిష్టాన్ని తాకి.. తొలిసారి 93 మార్క్‌ను చేరిన రూపాయి విలువ మరో సెషన్‌లోనే 94 మార్క్‌ను దాటడం తీవ్ర ఆందోళనకర అంశం. పశ్చిమాసియాలో పెరుగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు, దేశీయ స్టాక్ మార్కెట్లు ఒక్కరోజే 1,836 పాయింట్లు కుప్పకూలడం రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచాయని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. రానున్న రోజుల్లో రూపాయి విలువ రూ.93.60 నుండి 94.40 మధ్య ట్రేడ్ అయ్యే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే రిజర్వ్ బ్యాంక్ జోక్యం చేసుకుంటే దిగువ స్థాయిల వద్ద కొంత మద్దతు లభించవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ పతనం కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు పెను సవాలుగా మారుతోంది. రూపాయి విలువ ఇలాగే క్షీణిస్తూ ఉంటే దేశంలో ద్రవ్యోల్బణం నియంత్రణ తప్పే ప్రమాదం ఉంది.

# కొబ్బరి నీళ్లు తాగితే ప్రమాదమా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రకృతి ప్రసాదించిన అత్యంత స్వచ్ఛమైన డ్రింక్ ఏది అంటే ఎవరైనా కొబ్బరి నీళ్లు అని చెబుతారు. విటమిన్లు, ఎలక్ట్రోలైట్లు, మినరల్స్‌కు నిలయమైన ఈ పానీయం దాహాన్ని తీర్చడమే కాదు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని మనం నమ్ముతాం. అయితే అదే కొబ్బరి నీరు ఒక నిండు ప్రాణాన్ని కేవలం 26 గంటల్లో బలితీసుకుంటుందని ఎవరైనా ఊహిస్తారా? కొన్ని నెలల క్రితం డెన్మార్క్‌లో 69 ఏళ్ల వృద్ధుడికి ఎదురైన విషాదకర ఘటన ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. డెన్మార్క్‌లో ఒక వృద్ధుడు తాజాగా కనిపిస్తున్న కొబ్బరికాయను కొట్టించుకుని నీళ్లు తాగాడు. తాగిన మూడు గంటలకే అతనికి విపరీతంగా చెమటలు పట్టడం, వాంతులు, వికారం మొదలయ్యాయి. ఆసుపత్రికి తరలించేసరికి అతను గందరగోళానికి గురై, కండరాల కదలికలపై నియంత్రణ కోల్పోయాడు. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కేవలం 26 గంటల్లోనే అతని శరీరంలోని కీలక అవయవాలన్నీ విఫలమై మరణించాడు. మృత్యుపాశం: పరిశోధనలో తేలిన అంశం ఏంటంటే.. వైద్యులు నిర్వహించిన కొబ్బరి నీరు సేవించిన తర్వాత ప్రాణాంతకమైన 3-నైట్రోప్రొపియోనిక్ విషం వల్ల చనిపోయినట్లు అధ్యయనంలో షాకింగ్ నిజాలు బయటపడ్డాయి. ఆ కొబ్బరి నీళ్లలో 3-నైట్రోప్రొపియోనిక్ యాసిడ్ అనే శక్తివంతమైన శిలీంధ్ర విషం ఉన్నట్లు గుర్తించారు. బయటకు కాయ తాజాగా కనిపిస్తున్నా లోపల ఈ విషపూరిత శిలీంధ్రాలు వృద్ధి చెందుతాయి. ఇది ఎలా చేరుతుంది: కొబ్బరికాయలు కోసిన తర్వాత వాటిని సరైన పద్ధతిలో నిల్వ చేయకపోతే, ముఖ్యంగా వెచ్చని, తేమతో కూడిన వాతావరణంలో ఉంచినప్పుడు, పెంకుపై ఉండే సూక్ష్మ పగుళ్ల ద్వారా ఆర్త్రోబీనియం వంటి శిలీంధ్రాలు లోపలికి ప్రవేశిస్తాయి. ఇవి నీటిలో చేరి 3-ఔఖం అనే విషాన్ని ఉత్పత్తి చేస్తాయి. బయటకు కాయ ఎంతో తాజాగా కనిపిస్తున్నా, లోపల మాత్రం ఈ నిగూఢ విషం తయారవుతుంది. కలుషిత కొబ్బరి నీళ్లు తాగిన కొద్ది గంటల్లోనే వాంతులు, విరేచనాలు, తీవ్రమైన కడుపునొప్పి రావచ్చు. 3-ఔఖం నేరుగా మెదడును, నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుంది. దీనివల్ల మూర్ఛలు, కండరాల అసాధారణ సంకోచాలు సంభవిస్తాయి. ఊపిరితిత్తుల్లో ద్రవం చేరడం, ఛాతి బిగుతుగా మారి శ్వాస తీసుకోవడం కష్టమవ్వడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. విషం తీవ్రత పెరిగితే కాలేయం, కిడ్నీలు దెబ్బతిని మరణం సంభవించవచ్చు. నీరు తాగేటప్పుడు కొంచెం పుల్లగా ఉన్నా, రుచి మారినా లేదా అసాధారణ వాసన వస్తున్నా వెంటనే ఆ నీటిని పారేయండి. ప్యాక్ చేసిన కొబ్బరి నీళ్లను పాశ్చరైజేషన్ చేస్తారు కాబట్టి, అవి నేరుగా చిప్ప నుండి తాగే వాటికంటే కొన్నిసార్లు సురక్షితం. కొబ్బరికాయలను చల్లని ప్రదేశంలో ఉంచండి. అయితే ఫ్రిజ్‌లో ఉంచినంత మాత్రాన ప్రమాదం పూర్తిగా పోదు, తాగే ముందు తనిఖీ ముఖ్యం. గర్భిణీలు, చిన్న పిల్లలు మరియు వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు పచ్చి, శుద్ధి చేయని కొబ్బరి నీటిని తాగేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలి.

# మల్టీగ్రెయిన్ పిండి అందరికీ మంచిది కాదా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆధునిక జీవనశైలిలో ఆరోగ్య స్పృహ పెరగడంతో చాలా మంది సాధారణ గోధుమ పిండికి బదులుగా మల్టీగ్రెయిన్ పిండిని వాడుతున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని భావించే మల్టీగ్రెయిన్ పిండి అందరికీ సరిపడకపోవచ్చు. ప్రకటనల్లో చూసినట్లుగా ఇది అందరికీ అమృతం లాంటిది కాదు. కొన్ని ప్రత్యేక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు దీనిని తీసుకునే ముందు జాగ్రత్త వహించాలని నిపుణులు సూచిస్తున్నారు. లేదంటే, కొన్ని సందర్భాల్లో ఇది ఆరోగ్యానికి మేలు కంటే కీడే ఎక్కువ చేయవచ్చు అంటున్నారు. ఆధునిక జీవనశైలిలో ఆరోగ్య స్పృహ పెరగడంతో చాలా మంది సాధారణ గోధుమ పిండికి బదులుగా మల్టీగ్రెయిన్ పిండిని వాడుతున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని భావించే మల్టీగ్రెయిన్ పిండి (ఓబీశ్రీబితిణతీజీతిని ంబిబిజీ) అందరికీ సరిపడకపోవచ్చు. ప్రకటనల్లో చూసినట్లుగా ఇది అందరికీ అమృతం లాంటిది కాదు. కొన్ని ప్రత్యేక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు దీనిని తీసుకునే ముందు జాగ్రత్త వహించాలని నిపుణులు సూచిస్తున్నారు. లేదంటే, కొన్ని సందర్భాల్లో ఇది ఆరోగ్యానికి మేలు కంటే కీడే ఎక్కువ చేయవచ్చు అంటున్నారు. మల్టీగ్రెయిన్ పిండిలో గోధుమలతో పాటు జొన్నలు, సజ్జలు, రాగులు, సోయాబీన్ మరియు శనగలు వంటి వివిధ రకాల ధాన్యాలు కలుస్తాయి. ఇది పీచు పదార్థం (ఈతిఎవతీ) మరియు ప్రోటీన్లకు మంచి వనరు అయినప్పటికీ, అందరి శరీరతత్వానికి ఇది సెట్ అవ్వదు. మీ శరీర అవసరాలకు అనుగుణంగా ధాన్యాలను ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. జీర్ణక్రియ సమస్యలు ఉన్నవారు: మల్టీగ్రెయిన్ పిండిలో ఫైబర్ చాలా ఎక్కువగా ఉంటుంది. జీర్ణశక్తి తక్కువగా ఉన్నవారు లేదా ఐబీఎస్ (ఎబా) వంటి సమస్యలు ఉన్నవారు దీనిని తింటే ఆహారం త్వరగా అరగదు. దీనివల్ల కడుపు నొప్పి, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు తలెత్తుతాయి.

కిడ్నీ రోగులు: కిడ్నీ సమస్యలతో బాధపడేవారు తక్కువ పొటాషియం, ఫాస్పరస్ ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. మల్టీగ్రెయిన్ పిండిలో వివిధ రకాల చిరుధాన్యాలు కలవడం వల్ల వీటి శాతం పెరుగుతుంది, ఇది కిడ్నీలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది.థైరాయిడ్ సమస్యలు: చాలా మల్టీగ్రెయిన్ మిశ్రమాలలో సోయాబీన్ పిండిని కలుపుతారు. సోయాలో ఉండే కొన్ని పదార్థాలు థైరాయిడ్ మందుల పనితీరును అడ్డుకుంటాయి. కాబట్టి థైరాయిడ్ ఉన్నవారు సోయా లేని పిండిని ఎంచుకోవాలి. అలర్జీ బాధితులు: మార్కెట్లో దొరికే పిండిలో ఏయే ధాన్యాలు ఏ నిష్పత్తిలో ఉన్నాయో స్పష్టంగా తెలియదు. గ్లూటెన్ పడని వారు లేదా కొన్ని రకాల ధాన్యాల పట్ల అలర్జీ ఉన్నవారు దీనిని వాడటం వల్ల చర్మ సమస్యలు లేదా శ్వాస ఇబ్బందులు రావచ్చు. నిపుణుల సలహా: బయట దొరికే రెడీమేడ్ ప్యాకెట్ల కంటే, ఇంటి వద్దే మీకు కావలసిన ధాన్యాలను తగిన నిష్పత్తిలో కలిపి పిండి పట్టించుకోవడం ఉత్తమం. ప్రారంభంలో తక్కువ పరిమాణంలో తిని, మీ శరీరానికి అది పడుతుందో లేదో గమనించాలి.

# నిమిషాల్లోనే సూపర్ ఫుడ్.. ఒక్క కప్పు తింటే చాలు..



**హైదరాబాద్ పెన్ పవర్:** జొన్న అంబలి, జొన్న పిండితో తయారుచేసే ఓ పాతకాలపు ఆరోగ్యకరమైన వంటకం. ఇది శరీరానికి అవసరమైన మంచి బ్యాక్టీరియాను అందించి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. సులభంగా తయారుచేసే ఈ అంబలి బరువు తగ్గాలనుకునే వారికి, అలాగే అన్ని వయస్సుల వారికీ అల్పాహారంగా లేదా రాత్రి భోజనంగా అనువైనది. కడుపుకు చలువ చేసి, జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. జొన్న జావ పోషకాల గని.. ఇది శరీరానికి శక్తిని, ఆరోగ్యాన్ని అందిస్తుంది. అందుకే.. జొన్న జావ ప్రతిరోజూ తాగాలని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు.. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొంటున్నారు. వాస్తవానికి జొన్నల్లో ఇందులో ఫైబర్, ప్రోటీన్, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, విటమిన్ ః3 (నియాసిన్) వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అందుకే.. ఈ సంప్రదాయ పానీయం.. జొన్న జావను శతాబ్దాలుగా వినియోగిస్తున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఈ జావను తీసుకోవడం వల్ల ఎన్నో సమస్యలు దూరమవుతాయని పేర్కొంటున్నారు. జొన్న జావ.. బరువు తగ్గడానికి, డయాబెటిస్ నియంత్రణకు, ఎముకల బలానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడే ఒక సూపర్ ఫుడ్.. అని ప్రతిరోజూ తప్పనిసరిగా తీసుకోవాలని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు.. జొన్నపిండి, నీరు ? మజ్జిగతో సులభంగా 5 నిమిషాల్లో తయారుచేసుకునే ఈ జావ, వేసవిలో ఒంటికి చలవ చేసి శక్తినిస్తుంది.

వాస్తవానికి జొన్న జావ లేదా జొన్న అంబలి అనేది జొన్న పిండితో తయారుచేసే ఒక పాతకాలపు, ఆరోగ్యకరమైన వంటకం. ఇది శరీరానికి అవసరమైన మంచి బ్యాక్టీరియాను పుష్కలంగా అందిస్తుంది. అల్పాహారంగా లేదా రాత్రి భోజనంగా ఏ వయసు వారైనా దీనిని తీసుకోవచ్చు. క్రమం తప్పకుండా జొన్న అంబలిని తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి, ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

జొన్న జావ తయారీ విధానం:ముందుగా, స్టవ్ మీద ఒక గిన్నె పెట్టి ఐదు కప్పుల నీటిని పోసి మరిగించాలి. ఈలోపు, మరొక గిన్నెలో ఒక కప్పు జొన్న పిండిని తీసుకుని, ఒక కప్పు నీటిని కలిపి ఉండలు లేకుండా బాగా కలుపాలి. తర్వాత ఇంకొక కప్పు నీటిని కలిపి పిండిని కొద్దిగా పల్చగా చేయాలి. పిండి ఉండ కట్టకుండా ఉండటానికి ఈ విధంగా నీటితో కలపడం ముఖ్యం. నీళ్లు బాగా మరిగిన తర్వాత, ఫ్లేమ్‌ను తగ్గించి, కలిపి పెట్టుకున్న జొన్న పిండి మిశ్రమాన్ని నెమ్మదిగా పోస్తూ గరిటెతో నిరంతరం కలుపుతూ ఉండాలి. అడుగున అంటుకోకుండా ఉండటానికి మధ్యమధ్యలో కలుపుతూ, ఐదు నిమిషాల పాటు చిక్కబడే వరకు ఉడికించాలి. రవ్వతో అంబలి చేసేటట్లయితే, ఒక గ్లాసు రవ్వకు ఆరు గ్లాసుల నీళ్లు పోసి, రవ్వ మెత్తగా ఉడికే వరకు సమయం ఎక్కువ తీసుకోవాల్సి ఉంటుంది. అంబలి ఉడికిన తర్వాత స్టవ్ ఆపివేసి, రెండు నిమిషాల పాటు కలుపుతూ పక్కన పెట్టాలి. దీనికి ఉల్లిపాయ, మజ్జిగను యాడ్ చేసుకోని తాగవచ్చు..

పులియబెట్టే ప్రక్రియ:ఉడికించిన జావను శుభ్రమైన మట్టికుండలో పోసి, మూత పెట్టి ఆరు నుండి ఏడు గంటలు లేదా రాత్రంతా పులియనివ్వాలి. మట్టికుండలో పులియబెట్టడం వల్ల మంచి బ్యాక్టీరియా మరింత సమృద్ధిగా అభివృద్ధి చెందుతుంది. రాత్రంతా పులియబెట్టిన తర్వాత, ఉదయం జావ గట్టిగా జున్నులా తయారవుతుంది. దీనిని గరిటెతో ఉండలు లేకుండా బాగా కలిపి మెత్తగా చేసుకోవాలి. మెత్తగా చేసుకున్న జావలో అర లీటరు మజ్జిగను సగం సగం పోస్తూ బాగా కలుపాలి. ఇంకా పల్చగా కావాలంటే ఎక్కువ మజ్జిగ కలుపుకోవచ్చు. మధ్యమధ్యలో ఉండలు ఉంటే, పెరుగు చిలికే దానితో బీట్ చేసుకోవచ్చు. చివరగా, రుచికి సరిపడా చాలా కొద్దిగా ఉప్పును కలిపి బాగా కలుపాలి. అంతే, పోషక విలువలు నిండిన జొన్న అంబలి సిద్ధం. రాత్రంతా పులియబెట్టడం వల్ల జొన్న అంబలిలో ప్రొబయోటిక్స్ (మంచి బ్యాక్టీరియా) అధికంగా అభివృద్ధి చెందుతాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని పెంచడానికి, జీర్ణవ్యవస్థను మెరుగుపరచడానికి సహాయపడతాయి. చెడు బ్యాక్టీరియాతో పోరాడటానికి శరీరాన్ని బలంగా ఉంచుతాయి. బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి అల్పాహారం లేదా రాత్రి భోజనం. వేసవిలో శరీరంలోని వేడిని తగ్గించి, కడుపులో చల్లగా, హాయిగా ఉండేలా చేస్తుంది. సన్నగా తరిగిన ఉల్లిపాయ, కరివేపాకు, కొత్తిమీర కలిపి తీసుకోవడం వల్ల రుచి మరింత పెరుగుతుంది.

# 13 గంటల ఉపవాసంతో ఇన్సులిన్ మ్యాజిక్!



**హైదరాబాద్ పెన్ పవర్:** చాలామంది రాత్రి 10 లేదా 11 గంటలకు భోజనం చేసి వెంటనే పడుకుంటారు. దీనివల్ల శరీరంలోని సహజ జీవ గడియారం దెబ్బతింటుంది. నిద్రపోయే సమయంలో శరీరం విశ్రాంతి తీసుకోవాలి, కానీ ఆలస్యంగా తినడం వల్ల జీర్ణక్రియ కొనసాగి రక్తపోటు పెరుగుతుంది. నిద్రకు కనీసం మూడు గంటల ముందే భోజనం ముగించడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు.ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో సరైన సమయానికి ఆహారం తీసుకోకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా రక్తపోటు, మధుమేహం వంటివి ప్రతి ఇంట్లోనూ సాధారణమైపోయాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ గణాంకాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది ఈ సమస్యలతో పోరాడుతున్నారు. అయితే, మనం తినే ఆహారంలో మార్పులు చేయకుండానే, కేవలం 'తినే సమయాన్ని' మార్చడం ద్వారా ఈ రెండింటినీ నియంత్రించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పరిశోధనలో తేలిన నిజాలు.. నార్త్ వెస్ట్రన్ యూనివర్సిటీ పరిశోధకులు 36 నుండి 75 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారిపై ఈ అధ్యయనం చేశారు. వీరికి నిద్రకు మూడు గంటల ముందే భోజనం ముగించి, రాత్రిపూట 13 నుండి 16 గంటల పాటు ఉపవాసం ఉండాలని సూచించారు. దీనివల్ల వారిలో ఆశ్చర్యకరమైన మార్పులు కనిపించాయి. రాత్రి సమయంలో వీరి రక్తపోటు సుమారు 3.5% మేర తగ్గింది. హార్ట్ రేట్ 5% వరకు తగ్గి, గుండె పనితీరు మెరుగుపడింది. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులోకి రావడమే కాకుండా, ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరిగింది. ఇది డయాబెటిస్ రోగులకు ఎంతో మేలు చేస్తుంది. మీరు రాత్రి 10 గంటలకు నిద్రపోతారనుకుంటే, రాత్రి 7 గంటల లోపే భోజనం పూర్తి చేయాలి. భోజనం తర్వాత లైట్ల వెలుతురు తగ్గించి, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండటం వల్ల మెటబాలిజం మెరుగుపడుతుంది. రాత్రిపూట పప్పు, పనీర్, సలాడ్ లేదా గ్రిల్ చేసిన చికెన్ వంటి తేలికపాటి ఆహారం తీసుకోవడం ఉత్తమం. రాత్రిపూట ఎక్కువ సేపు ఉపవాసం ఉండటం వల్ల శరీరంలో కార్టిసాల్ అనే హార్మోన్ తగ్గి, మెటబాలిజం సమతుల్యం అవుతుంది. షిఫ్ట్ డ్యూటీలు చేసే వారికి ఇది కొంచెం కష్టమైనా, సాధారణ వ్యక్తులు ఈ చిన్న అలవాటును మార్చుకోవడం ద్వారా గుండె జబ్బుల ముప్పు నుండి తప్పించుకోవచ్చు. వీకెండ్స్‌లో కూడా ఇదే నిద్ర సమయాన్ని పాటించడం వల్ల ఫలితాలు మెరుగ్గా ఉంటాయని నిపుణులు తెలియజేస్తున్నారు. మనం ఏమి తింటున్నాం అనే దానికంటే, 'ఎప్పుడు తింటున్నాం' అనేది మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది. నిద్రకు మూడు గంటల ముందు భోజనం ముగించడం అనే చిన్న మార్పుతో మీ రక్తపోటు, చక్కెర స్థాయిలను సహజంగానే నియంత్రించుకోవచ్చు.

# ఆందోళనతో అల్లాడిపోతున్నారా?



**హైదరాబాద్ పెన్ పవర్:** యాంగ్జైటీ అనేది ఒక సాధారణ మానసిక స్థితి అయినప్పటికీ, దానిని నిర్లక్ష్యం చేస్తే అది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. మన ఆలోచనలు మన నియంత్రణలో ఉన్నప్పుడే జీవితం ఆనందంగా ఉంటుంది. నేటి యాంత్రిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. ఆఫీసు పనులు, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక ఇబ్బందులు.. ఇలా కారణం ఏదైనా కావచ్చు, మనసులో నిరంతరం ఆందోళన గూడు కట్టుకుంటోంది. ఈ ఆందోళన కేవలం మనసుకే పరిమితం కాకుండా, నిద్రలేమి, అధిక రక్తపోటు వంటి శారీరక సమస్యలకు కూడా దారితీస్తోంది.అయితే, మందుల కంటే ముందు మన జీవనశైలిలో చేసుకునే చిన్న చిన్న మార్పులతో ఈ యాంగ్జైటీని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ప్రశాంతమైన మనసు కోసం మీరు పాటించాల్సిన ఆ అద్భుతమైన చిట్కాలు ఇవే!శ్వాసపై ధ్యాస : మీకు ఎప్పుడైనా విపరీతమైన ఆందోళనగా అనిపించినప్పుడు, వెంటనే మీ శ్వాస వేగం పెరుగుతుంది. అప్పుడు 'డీప్ బ్రీతింగ్' అద్భుతంగా పనిచేస్తుంది. ముక్కు ద్వారా గాలిని పీల్చి, నాలుగు సెకన్ల పాటు ఆపి, ఆపై నెమ్మదిగా వదలాలి. ఇలా 5 నిమిషాలు చేస్తే మెదడుకు ఆక్సిజన్ అంది వెంటనే రిలాక్స్ అవుతారు. వ్యాయామం : శారీరక శ్రమకు, మానసిక ఆరోగ్యానికి దగ్గరి సంబంధం ఉంది. రోజుకు కనీసం 20 నిమిషాల నడక లేదా యోగా చేయడం వల్ల శరీరంలో 'ఎండార్ఫిన్లు' అనే హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి ఒత్తిడిని తగ్గించి మనసును ఉల్లాసంగా ఉంచుతాయి.కెఫిన్, చక్కెరపై నియంత్రణ : మనం తీసుకునే ఆహారం మన మూడ్‌ని ప్రభావితం చేస్తుంది. అతిగా కాఫీ, టీలు తాగడం వల్ల అందులోని కెఫిన్ మనల్ని మరింత ఉద్రేకానికి గురి చేస్తుంది. అలాగే ఎక్కువ చక్కెర ఉన్న పదార్థాలు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను అకస్మాత్తుగా పెంచి, తగ్గించడం వల్ల యాంగ్జైటీ పెరుగుతుంది. వీటిని పరిమితం చేయడం శ్రేయస్కరం.డిజిటల్ డిటాక్స్ : నిద్రలేమి ఆందోళనకు ప్రధాన శత్రువు. రాత్రి పడుకునే గంట ముందు మొబైల్ ఫోన్ పక్కన పెట్టేయండి. స్క్రీన్ నుండి వచ్చే బ్లూ లైట్ నిద్రను దూరం చేస్తుంది. రోజుకు 7-8 గంటల గాఢ నిద్ర మీ మనసును రీఛార్జ్ చేస్తుంది.అభిరుచులకు ప్రాణం పోయండి : మీకు ఇష్టమైన పనిలో నిమగ్నమవ్వడం కంటే గొప్ప మందు

మరొకటి లేదు. పుస్తక పఠనం, గార్డెనింగ్ లేదా సంగీతం వినడం వంటి హాబీలు మనసును నెగటివ్ ఆలోచనల నుండి మళ్ళిస్తాయి. ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు సన్నిహితులు లేదా కుటుంబ సభ్యులతో మనసు విప్పి మాట్లాడటం వల్ల భారం తగ్గుతుంది. జీవితంలో సమస్యలు రావడం సహజం, కానీ వాటిని మనం ఎలా స్వీకరిస్తామనేదే ముఖ్యం. పైన పేర్కొన్న చిన్న చిన్న అలవాట్లను మీ దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే, ఆందోళనను జయించి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చు. ఒకవేళ సమస్య మరీ తీవ్రంగా ఉంటే నిపుణుల సలహా తీసుకోవడానికి వెనుకాడకండి.

## చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాట.. ఆ 11 మందికి స్టేడియంలో పర్మినెంట్ ప్లేస్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025 విజయోత్సవ వేడుకల్లో చనిపోయిన ఫ్యాన్స్ కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కీలక నిర్ణయం తీసుకుంది. కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) సహకారంతో చనిపోయిన అభిమానుల పేర్లపై స్టేడియంలో శాశ్వత సీట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. కాగా ఐపీఎల్ 2026 సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో ఆర్సీబీ చిన్నస్వామి స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తొలి మ్యాచ్ ఆడబోతుంది. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు స్టేడియం ప్రవేశ ద్వారం దగ్గర 11 మంది ఫ్యాన్స్ మృతుల జ్ఞాపకార్థం ఒక స్మారక ఫలకాన్ని ఆవిష్కరించబోతుంది. అంతేకాదు, స్టేడియంలోని 11 సీట్లను శాశ్వతంగా వారి పేరుపై రిజర్వ్ చేసి.. ఎల్లప్పుడూ ఖాళీగా ఉంచాలని నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో ఇక్కడ జరిగే అంతర్జాతీయ మ్యాచ్‌లు సహా అన్ని ఈవెంట్లలో ఈ సీట్లు ఖాళీగానే కనిపిస్తాయని అధికారులు తేల్చి చెప్పారు. 11 మంది అభిమానుల జ్ఞాపకార్థం 11వ నెంబర్ ప్రాక్టీస్ జెర్సీలను ప్లేయర్స్, సపోర్ట్ స్టాఫ్ ధరించొద్దన్నారు. ఈ విషయాన్ని ఆర్సీబీ సీఈవో రాజేష్ మీనన్ ఇవాళ తెలియజేశారు. ఇది మా ప్రయాణంలో మాతోనే నడిచిన మా ఫ్యాన్స్ కోసం మేము అర్పించే నివాళి అన్నారు. మ్యాచ్ రోజు ఆటగాళ్లంతా నల్లని కళ్లద్దాలను కూడా ధరిస్తారని పేర్కొన్నారు.

ఐపీఎల్ 2025లో జరిగిన ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి ఆర్‌సీబీ విజేతగా నిలిచింది. 18 ఏళ్ల తర్వాత ట్రోఫీని గెలవడంతో ఆర్సీబీ ఫ్యాన్స్ ఆనందానికి హద్దేలేకుండా పోయింది. జూన్ 4న బెంగళూరులో నిర్వహించిన విజయోత్స వేడుక తీవ్ర విషాదంగా మారింది. ఈ విజయోత్స వేడుకలను చూసేందుకు లక్షల్లో అభిమానులు తరలిరావడంతో చిన్నస్వామి స్టేడియం వెలుపల తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. 50 మంది గాయపడ్డారు. చనిపోయిన వారిలో చిన్నారులతో పాటు మహిళలు కూడా ఉన్నారు.

## అమ్ముడుపోయిన రాజస్థాన్ రాయల్స్.. ఏకంగా రూ. 15 వేల కోట్లకు..





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత భారీ డీల్ నమోదు అయింది. రాజస్థాన్ రాయల్స్ జట్టు అమ్మకం ప్రక్రియ ఎట్టకేలకు పూర్తైంది. భారత సంతతికి చెందిన అమెరికన్ పారిశ్రామికవేత్త కల్ సోమాని నేతృత్వంలోని కన్సార్టియం, ఈ జట్టును 1.63 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసినట్లు జాతీయ మీడియాలో వార్త కథనాలు వస్తున్నాయి. ఇండియన్ కరెన్సీలో దీని విలువ సుమారు రూ. 15,280 కోట్ల వరకు ఉంటుంది. దీంతో ఒక బిలియన్ డాలర్లకు విక్రయించిన తొలి ఐపీఎల్ జట్టుగా రాజస్థాన్ చరిత్ర సృష్టించింది.

**అధికారికంగా జట్టు బాధ్యతలు:**

ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత ఈ కొత్త యాజమాన్యం జట్టు బాధ్యతలను అధికారికంగా చేపట్టనుంది. గతంలో ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ లక్నో సూపర్ జెయింట్స్‌ను 940 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేయగా, ఇప్పుడు రాజస్థాన్ ఆ రికార్డును అధిగమించింది. అయితే కల్ సోమాని కన్సార్టియానికి వాల్‌మార్ట్ ఫ్యామిలీకి చెందిన అమెరికన్ వ్యాపారవేత్త రాబ్ వాల్టన్, అలాగే ఎన్ఎఫ్ఎల్ జట్టు డెట్రాయిట్ లయన్స్‌లో మెజారిటీ వాటాలు కలిగిన హాంప్ కుటుంబం నుంచి ఆర్థికంగా సపోర్టు ఉంది.

**ఎవరీ కల్ సోమాని?:**

అరిజోనాకు చెందిన కల్ సోమాని ఒక ప్రముఖ ఎంట్రప్రెన్యూర్. ఆయనకు డేటా ప్రైవసీ, ఎడ్‌టెక్ , క్రీడా సాంకేతికత లాంటి రంగాల్లో 15 ఏళ్లకు పైగా అనుభవం కలిగి ఉన్నారు. అతడు ఇంట్రాఎడ్జ్, ట్రూయో వంటి సంస్థలకు వ్యవస్థాపకుడిగా కొనసాగుతున్నారు. 2021 నుంచే ఆయనకు రాజస్థాన్ రాయల్స్‌లో మైనారిటీ వాటాని కలిగి ఉన్నారు. తాజాగా ఇప్పుడు 100 శాతం వాటాను దక్కించుకున్నారు. క్రీడల పట్ల ఇంట్రెస్ట్ ఉన్న సోమాని.. మోటార్ సిటీ గోల్ఫ్ క్లబ్‌కు సహ-యజమానిగా, TGL గోల్ఫ్ లీగ్‌లలో తొలి పెట్టుబడిదారులలో ఒకరిగా ఉన్నారు.

## ఎస్ఆర్‌హెచ్ VS ఆర్సీబీ మ్యాచ్‌కి బిగ్ షాక్.. ఆరోజు వర్షం పడే ఛాన్స్!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ అత్యంత ఉత్కంఠభరితమైన పోరుతో ప్రారంభం కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మార్చి 28వ తేదీన రాత్రి 7:30 గంటలకు ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. కాగా ఈ మ్యాచ్‌పై నీలి నీడలు కమ్ముకునేలా కనిపిస్తున్నాయి. మార్చి 28వ తేదీన బెంగళూరులో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఒకవేళ ఆరోజు వర్షం అంతరాయం కలిగించకుండా ఉంటే, ఈ మ్యాచ్ ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఉత్కంఠభరితమైన ఓపెనింగ్ మ్యాచ్‌లలో ఒకటిగా నిలుస్తుంది.

**గెలిచే అవకాశం ఎవరికి?:**

గణాంకాల ప్రకారం, సొంత గడ్డపై ఆడుతుండటంతో ఆర్సీబీకి 54 శాతం గెలిచే అవకాశం ఉండగా, ఎస్ఆర్‌హెచ్‌కు 46 శాతం ఛాన్స్ ఉంది.

ూ=ఎ దూకుడు: హైదరాబాద్ జట్టులో ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ వంటి విధ్వంసకర ఓపెనర్లు ఉన్నారు. హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్, లియామ్ లివింగ్‌స్టోన్‌లతో హైదరాబాద్ బ్యాటింగ్ లైన్-అప్ చాలా బలంగా ఉంది. మ్యాచ్ ప్రారంభమైన తొలి ఓవర్ నుంచే అటాకింగ్ గేమ్‌ను ఆడటమే వీరి ప్రధాన వ్యూహంగా ముందుకు వెళ్తున్నారు.

RCB **బలం:** సొంత గడ్డపై ఆడుతుండటం ఆర్సీబీకి కలిసొచ్చే అంశం. విరాట్ కోహ్లీ, ఫిలిప్ సాల్ట్ ఓపెనింగ్ జోడీపై భారీ అంచనాలు పెట్టుకుంది ఆర్సీబీ యాజమాన్యం. మిడిల్ ఆర్డర్‌లో రజత్ పాటిదార్, జితేష్ శర్మ, టిమ్ డేవిడ్ వంటి పవర్‌ఫుల్ హిట్టర్లు ఉన్నారు.

**పిచ్ రిపోర్ట్:**

బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియం ఎప్పుడూ బ్యాటర్లకు స్వర్గధామం అని చెప్పాలి. ఇక్కడ 180 పరుగులు కూడా సాధారణ స్కోరుగా పరిగణించబడుతుంది. ఒకవేళ 200ం దాటితే అది గెలిచేందుకు భావించే స్కోర్ గా పేర్కొంటారు. ఈ మైదానంలో చిన్న బౌండరీలు ఉండటంతో సిక్సర్ల వర్షం ఖాయం.

**వెదర్ రిపోర్ట్:**

పగటిపూట గరిష్టంగా 34 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

సాయంత్రం వేళ 60 శాతం వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తుంది.

మార్చి 28న సాయంత్రం గంటకు 30 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులు, పిడుగులతో కూడిన వర్షం మ్యాచ్‌కు ఆటంకం కలిగించే అవకాశం ఉంది.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు అంచనా:** ఫిలిప్ సాల్ట్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్ (కెప్టెన్), జితేష్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జాకబ్ డఫీ, మంగేష్ యాదవ్

**సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు అంచనా:** అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్ (కెప్టెన్/వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్, అనికేత్ వర్మ, హర్షల్ పటేల్, లియామ్ లివింగ్‌స్టోన్, జీషన్ అన్సారీ, ఈషన్ మలింగ, జయదేవ్ ఉనద్కత్



బిగ్ బాస్ నుండి సిల్వర్ స్క్రీన్‌కి బ్రైట్ లెహెంగా వైబ్స్ మరియు బాత్‌ని మెరిసిన ఆశు రెడ్డి

## ధురంధర్ 2 టాప్ ప్లేస్ కొడుతుందా? దంగల్ ను బీట్ చేస్తుందా?



బాలీవుడ్ లో భారీ సంచలనం సృష్టిస్తున్న చిత్రం ధురంధర్: ది రివెంజ్. దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఆ స్పై థ్రిల్లర్ లో రణవీర్ సింగ్ లీడ్ రోల్ లో నటించిన విషయం తెలిసిందే. విడుదలైన కొద్ది రోజుల్లోనే ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డుల వర్షం కురిపిస్తూ దూసుకుపోతోంది. విడుదలైన నాలుగు రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా సుమారు రూ.750 కోట్ల గ్రాస్ వసూలు చేయడం విశేషం.విడుదలకు ముందు నిర్వహించిన పెయిడ్ ప్రివ్యూ ద్వారా రూ.43 కోట్లు రాబట్టిన ఆ చిత్రం, విడుదలైన తర్వాత కూడా అదే ఊపును కొనసాగించింది. ముఖ్యంగా ఆదివారం ఒక్కరోజే దేశీయ మార్కెట్ లో రూ.115 కోట్లు వసూలు చేసి కొత్త రికార్డు నెలకొల్పింది. హిందీ చిత్రసీమలో ఇప్పటి వరకు ఉన్న ఓపెనింగ్ వీకెండ్ రికార్డులు అధిగమించింది. ముఖ్యంగా బ్లాక్ బస్టర్ హిట్ మూవీ పఠాన్ సాధించిన ఓపెనింగ్ వీకెండ్ కలెక్షన్లను సునాయాసంగా దాటేసింది ధురంధర్: ది రివెంజ్ మూవీ. ఓవర్సీస్ మార్కెట్ లో కూడా ఆ సినిమా ప్రభంజనం సృష్టిస్తూ సుమారు రూ.180 కోట్లు వసూళ్లు నమోదు చేసింది. భారతీయ సినీ చరిత్రలో అత్యధిక ఓపెనింగ్ వీకెండ్ సాధించిన చిత్రాల జాబితాలో రెండో స్థానంలో నిలిచింది. బాహుబలి 2: ది కన్ క్లూజన్, ఆర్ఆర్ఆర్, కల్కి 2898 ఏడీ వంటి చిత్రాల రికార్డులు బ్రేక్ చేసింది. అదే సమయంలో ధురంధర్: ది రివెంజ్ త్వరలోనే రూ.1000 కోట్ల క్లబ్ లో చేరే అవకాశముంది. అదే వేగం కొనసాగితే లాంగ్ రన్ లో రూ.2000 కోట్ల మార్క్ ను కూడా చేరుకునే ఛాన్స్ ఉందని టాక్ వినిపిస్తోంది. అయితే ఇప్పటివరకు భారతీయ సినీ చరిత్రలో రూ.2000 కోట్ల మార్క్ ను అందుకున్న ఏకైక చిత్రం దంగల్ మాత్రమే. ఆ చిత్రం సుమారు రూ.2070 కోట్ల వసూళ్లతో టాప్ లో నిలిచింది. దాని తర్వాత బాహుబలి: ది కన్ క్లూజన్ (రూ.1788 కోట్లు), పుష్ప 2: ది రూల్ (రూ.1742 కోట్లు) తదితర చిత్రాలు నిలిచాయి. ఒకసారి ఆ లిస్ట్ ను చూద్దాం.

**1.దంగల్: రూ.2070 కోట్లు**

**2.బాహుబలి 2: రూ.1788 కోట్లు**

**3.పుష్ప 2: రూ.1742 కోట్లు**

**4.ధురంధర్: రూ.1307 కోట్లు**

**5.ఆర్ఆర్ఆర్: రూ.1230 కోట్లు**

**6.కేజీఎఫ్ 2: రూ.1215 కోట్లు**

**7.జవాన్: రూ.1160 కోట్లు**

**8.కల్కి 2898 ఏడీ: రూ.1042 కోట్లు**

**9.కాంతార 1: రూ.852 కోట్లు**

**10.ఛావా: రూ.808 కోట్లు**

ఈ నేపథ్యంలో ధురంధర్: ది రివెంజ్ మూవీ లాంగ్ రన్ లో ఎంత వసూళ్లు సాధిస్తుంది? దంగల్ రికార్డును బ్రేక్ చేయగలదా? అనే విషయం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. ప్రేక్షకుల ఆదరణ ఇదే విధంగా కొనసాగితే, ఇండియన్ బాక్సాఫీస్ చరిత్రలో సరికొత్త అధ్యాయం నమోదు కావడం ఖాయమని అంతా భావిస్తున్నారు. మరి చూడాలి ఏం జరుగుతుందో..



సాక్షి మాలిక్ ఒక ప్రో లాగా అథ్లెయిజర్‌ను ఎలా చంపాలో చూపిస్తుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965